మార్చి - 2016

# పరిశుద్ధత

ఆధ్యాత్మిక క్రైస్తవ మాసపత్రిక

ప్రధాన సంపాదకులు :
**రెవ.డా॥ కె. జోసఫ్**

సర్క్యులేషన్ :
**సామ్రాట్ కొడవటికంటి**

**చందా వివరములు :**
సంవత్సర చందా రూ. 150/-
పోషక చందా రూ. 1000/-
జీవిత చందా రూ. 3000/-
విడి ప్రతి రూ. 15/-

**మా చిరునామా :**
ఎడిటర్, పరిశుద్ధత
పోస్ట్‌బాక్స్ నెం. 28
ఒంగోలు - 523001
ఫోన్ : 08592-231281
సెల్ : 9704255416

## లోపలి పేజీల్లో...

| | | |
|---|---|---|
| సంపాదకీయం | ఎడిటర్ | 02 |
| అపొస్తలుడు | కొడవటికంటి | 03 |
| లియో టాల్‌స్టాయ్ | ఐ.ఇ.ఆర్.యఫ్. డెస్క్ | 06 |
| యేసుని గుర్తించని ప్రజలు | రెవ.డా॥కె.జోసఫ్‌గారు | 09 |
| బైబిలు చరిత్ర | ఐ.ఇ.ఆర్.యఫ్. డెస్క్ | 10 |
| తబితా | శ్రీమతి రేచల్‌జోసఫ్‌గారు | 14 |
| గెత్సేమనే తోట | బ్రదర్ కె. సామ్రాట్‌గారు | 15 |
| యేసు మృత్యుంజయుడే | రెవ.డా॥కె.జోసఫ్‌గారు | 17 |
| సాతాను మరియు పతనమైన దేవదూతలు | రెవ.డా॥ కొడవటికంటి విక్రాంత్ | 19 |
| పునరుజ్జీవములు మరియు సంస్కరణలు | శ్రీమతి రిబ్కా విక్రాంత్ | 22 |
| అక్షరయజ్ఞం - బైబిల్ క్విజ్ | శ్రీమతి కె.ప్రసన్న పరాక్రమ్‌గారు | 24 |

India Evangelistic & Relief Fellowship

| **EVANGELISM** | **RELIEF** |
|---|---|
| Church Planting | Orphanage |
| Evangelestic, Crusades | Child Development Centers |
| Pastor's Seminars | Education (U.C.L.I. Schools) |
| Youth Ministry | Widows & Leprosy Care |
| T.V.Ministry | Medical Assistance |
| Magazine Ministry | Help in Natural Calamity |
| Audio Ministry | Flood Relief |
| Jail & Prison Ministry | Mobile Medical Ministry |
| IERF International | Children Care Ministry |
| Hanna Women Ministries | |

**ప్రకటన రేట్లు**

| | | |
|---|---|---|
| టైటిల్ 4వ పేజీ | ..... | రూ. 3,000/- |
| టైటిల్ 3వ పేజీ | ..... | రూ. 2,000/- |
| లోపలి పేజీ | ..... | రూ. 1,000/- |

# సంపాదకీయం.....



ప్రభువునందు ప్రియ పాఠకులకు ప్రభువు నామమున ఈస్టర్ శుభాకాంక్షలు.

గత నెలలో మాసపత్రికను అభినందిస్తూ మీరు వ్రాసిన ఉత్తరములన్నిటినిబట్టి మీకు నా హృదయ పూర్వక వందనములు. ముఖ్యంగా బాప్తిస్మము గురించి, ప్రభువు బల్లను గురించి వ్రాసిన సంగతులను ప్రశంసిస్తూ వ్రాసిన వారికి కూడా నా కృతజ్ఞతలు. అయితే వారు విజ్ఞతతో విచక్షణ చేసి మరలా ఆ శీర్షికలను చదవాలని మనవి. మరలా మరలా బ్రతిమిలాడి వ్రాస్తున్నాను. "ప్రభువునందు విశ్వసించిన వారందరూ, వారెటువంటి వారైనప్పటికీ కూడా ప్రభువు బల్లకు యోగ్యులే"

ప్రభువు శరీరము శరీర స్వస్థతలకు రక్తము పాప క్షమాపణకు గుర్తుగా తీసికోవాలి. శరీరము తీసుకొనేటప్పుడు నీ రోగములను ప్రభువుకు విన్నవించి, ప్రభువు శరీరము స్వస్థత కొరకు అని నమ్మి తీసుకోవాలి. "ప్రభువు రక్తము పాపక్షమాపణ కొరకు అని నీ పాపములను ప్రభువుకు విన్నవించి ఆ రక్తము తీసికోవాలి. ప్రభువు రక్తము పాపుల కొరకే కాని నీతిమంతుల కొరకు కాదు". ప్రభువు శరీర రక్తములు అయోగ్యంగా అంటే ఈ విధమైన క్రియలు జరిగించును అని విశ్వసించకుండా విచక్షణా రహితంగా తీసికుంటే క్రొత్త రోగాలు వస్తాయని కాదు, వున్న రోగాలు పోవని అర్థం. ఇవన్నీ స్పష్టంగా గత మాస ముల పత్రికలో వ్రాసి యున్నాము. దయచేసి మరలా చదవవలసినగా మనవి.

ఈ మధ్యకాలంలో పీస్ ఛానల్ ద్వారా యేసు ప్రభువు యొక్క మరణ పునరుత్థానముల గుంచి చాలా విమర్శ జరుగుతుంది. ఈ పత్రికలో 'యేసు మృత్యుంజ యుడే!' అనే శీర్షిక ద్వారా వారికి సరైన సమాధానం వ్రాస్తున్నాము. ఇది మా విజ్ఞత కాదు. యేసే ఈ మర్మము మాకు తెలియజేశాడు. కనుక దయచేసి ఈ శీర్షిక చదువవలెనని మనవి.

ఇంకొక మనవి ఏమిటంటే ఈ పీస్ ఛాలన్‌ల బాగా విద్య కలవారే చూడగలరు. అంటే ఇంగ్లీషు వచ్చిన వారు. వారికి నా మనవి ఏమంటే దయచేసి ఆ ఛానల్ చూడవద్దు. అది ఎంతో సత్యముగా ఉన్నట్లు కనబడుతుంది. కాని అంతా అసత్యము. అవ్వను తియ్యని మాటలతో సాతానుడు మోపరచినట్లుగా ఉంటుంది. కాని అవి సత్యములు కాదు కొండెగాని మాటలు. "కొండెగాని మాటలు రుచిగల భోజన ములు. అవి కడుపులోనికి పోవును" సామెతలు 18:9. అవ్వ ఆ విధంగానే మోసపోయింది. కనుక దయచేసి ఆ ఛానల్ పెట్టుకోవద్దు. చూడవద్దని మీ స్నేహితులకు కూడా చెప్పండి. ఎందుకంటే చాలామంది తమ స్నేహితులకు యేసుక్రీస్తు గురించి ఏదో విమర్శ వస్తుం చూడండి అని ఫోన్లు చేస్తున్నారు. దయచేసి అలా చేయవద్దు.

బైబిల్ క్విజ్‌లో విజేతలకి బహుమానాలు రావటం లేదు అని వ్రాస్తున్నారు. అలా పొందని వారి వివరాలు వ్రాస్తే ఖచ్చితంగా పంపిస్తాము. మీ సలహాలు ఖచ్చితంగా స్వీకరిస్తాము. మంచి ఉత్తరాలకు కూడా మీరు కోరిన విధంగా ప్రవేశపెడుతున్నాము. మీరు కవితలు, శీర్షికలు వ్రాసి పంపితే పరిశీలించి ప్రచురించగలము. ప్రచురించిన వాటికి పారితోషకము కూడా ఇవ్వబడును.

మా 'పరిశుద్ధ ప్రవాహిని' టి.వి. కార్యక్రమాలు JOY టి.వి.లో సోమ, మంగళ, బుధవారాలలో సాయంత్రం 6 గంటల నుండి, ప్రార్ధన టి.వి.లో 6-30 నుండి ప్రసారమవుతాయి. దయచేసి వీక్షించండి. ప్రార్థించండి. మీకందరికీ వందనములు. -ఎడిటర్

# అపొస్తలుడు



**– కొడవటికంటి**

అప్పుడు అర్థమయ్యింది తను ఇప్పుడు తన దేశానికి ప్రయాణం కావాలి. బర్నబా సౌలు దగ్గరకు వచ్చి "మహా సభలో ఇంతకు ముందు మీతో కలిసి యెరూషలేములో శిష్యులను హింసించిన నీ మిత్రులు ఇప్పుడు నిన్ను చంప టానికి దృఢచిత్తముతో ఉన్నారు. వారందరు ఒకప్పుడు నిన్ను తమ నాయకునిగా ఏర్పాటు చేసుకున్న వారే! వారు రేపు సాయంకాలం దహనబలి సమయాన నిన్ను హతమార్చ టానికి ప్రతిజ్ఞ తీసుకొని, కొంతమంది హంతకులకు డబ్బు చెల్లించారు. కనుక కొంతకాలం తార్సులో ఉండటం మంచిదని శిష్యులందరు నిశ్చయించారు. ఇతరులకు తెలియక ముందే ప్రయాణం సాగించాలి" అని బయలు దేరారు.

షామీరు వరకు పేతురుగారు తోడుగా వస్తారు. అంటే తెల్లవారే వరకు తోడు వస్తారని తెలిసింది. యెరూషలేము వీధులలో గుండా ప్రయాణం చేస్తున్నంతసేపు వారు ఏ విషయం మాట్లాడలేదు. ఆవరణములో నుండి కుడిప్రక్కకి తిరిగి, దక్షిణం వైపున గవిని దాటి హిన్నోము లోయలో ప్రవేశించారు.

అక్కడ నుండి పడమటి వైపున పట్టణ ప్రాకారము వెంబడి నడచి గొల్గొతా కొండ ప్రక్కగా కొంతదూరము షామీరు బాట ఎక్కిన తర్వాతనే పేతురుగారు మొట్టమొదట మాట్లాడారు.

"మనం ఇప్పుడు నడుస్తున్న ఈ బాటలో ప్రభువు ఒక్కసారైనా నడచినట్లుగా నాకు గుర్తులేదు" అని అన్నాడు.

"ప్రభువుతో కలసి మీరెప్పుడైనా ప్రయాణీకుల బండిలో ప్రయాణం చేశారా?" అని అడిగాడు సౌలు.

"నాకు తెలిసినంత వరకు ప్రవచనము నెరవేర్పు కొరకు ఆఖరి పస్కా పండుగకు ముందు, ఆయన గాడిదపిల్ల మీద ఒక్కసారే బేత్పగె నుండి యెరూషలేము వరకు ప్రయాణం చేసి దేవాలయము వెలుపల ఆ గాడిదపిల్లను వదలి దేవాలయములో ప్రవేశించాడు" అన్నాడు.

"అయితే ఎంత దూరము ప్రయాణం చేసినా కాలి నడకేనా?" అడిగాడు సౌలు.

"చాలాసార్లు దోనెలోనే గలలియ ప్రాంతము సంచరిం చారు" అన్నాడు పేతురు.

"నీళ్ళ మీద ఎన్నిసార్లు నడిచారు?" అడిగాడు సౌలు ఆసక్తిగా.

"అయిదు రొట్టెలతో అనేకమంది ఆకలి తీర్చిన రాత్రి ఆయన నీళ్ళ మీద నడుస్తూ మా దగ్గరికి వచ్చాడు" అన్నాడు పేతురు.

"మీరు కూడా నీళ్ళ మీద నడిచారటగా?" అన్నాడు సౌలు చెప్పండి అన్నట్లు.

కేఫాగారు ఆలోచిస్తూ నడుస్తున్నాడు. "ఆ రాత్రి అసలు మేము బెత్సయిదా వెళ్ళాలనుకోలేదు. ఎలాగైనా ఆయనను రాజుగా అభిషేకించాలని జనసమూహమంతా నిశ్చయించు కున్నారు. ప్రభువైతే మమ్ములను బలవంతంగా దోనె యొద్దకు తీసుకొని వెళ్ళి మమ్ములను పంపించాడు. ఆ రాత్రి, ఆ గాలి వేగానికి మేము చాలా భయపడ్డాము. తెల్ల వారుతుంటే, మసక చీకట్లో ప్రభువు నీళ్ళ మీద నడిచి వస్తున్నాడు. ఏ మానవుడు ఈ భూమి పుట్టిన తరువాత నీళ్ల మీద నడవలేదు కదా! మేము భయపడ్డాము. ప్రభువు మమ్ములను పలకరించాడు. మేము ఆశ్చర్యములో నుండి తేరుకోకముందే –నేనేమి అడుగుతున్నానో ఆలోచించ కుండానే, 'ప్రభువా! నీళ్ళ మీద నడుస్తాను సెలవియ్యండి" అని అన్నాను. ఆయన రమ్మనగానే, దోనేలో నుండి నీళ్ళ మీద కాలుపెట్టినప్పుడు అది నీళ్ళతో నేలగా ఏర్పడింది. నేను ఇలాగే నడిచాను" అని సౌలు వైపుకు చూశాడు.

ఎంత అదృష్టము. ప్రభువు కాక నీళ్ళ మీద నడచిన మొదటి మానవుని ప్రక్కన నేను నడుస్తున్నావీ కదా! అనుకున్నాడు సౌలు. పేతురుగారు మరలా చెప్పటం

మొదలు పెట్టాడు.

"నీళ్ళ మీద నడుస్తున్నాను కదా! ఈ గాలికి జాగ్రత్తగా ఉండాలి అనుకున్నాను. వెంటనే నా కాలిక్రింద నీళ్ళ నేల మెత్తబడిపోయింది. ప్రభువు ఇంకాదూరంగానే ఉన్నాడు. నాకు తెలియకుండానే రక్షించమని కేకలు వేశాను. నేను కేక వేయక మునుపే, నేను ఇక నీళ్ళ మీద నడిచే విశ్వాసం పోగొట్టుకున్నానని గ్రహించి, ప్రభువు నా ఎదురుగానే ఉన్నారు. ఆయన నా చెయ్యి పట్టుకొనగానే మరలా నా కాళ్ళ క్రింద నీరు ఘనీభవించి నేలలా ఏర్పడింది. ఇద్దరం కలిసి నడుస్తూ వచ్చి దోనే ఎక్కాము" అని చెప్పాడు.

ఇంకా ప్రభువుతో తన అనుభవాలు ఎన్నో దారిలో మాట్లాడుతూనే తెల్లవారేసరికి షామీరు చేరారు. ఆ ఊరి గవిని దగ్గర సిసారియాకు వెళ్ళే ప్రయాణీకుల బగ్గీ సిద్ధముగా ఉంది. సౌలును, బర్నబాను అందులో ఎక్కించి, శిష్యులు, కేఫాగారితో కలిసి యెరూషలేము వైపు తిరిగారు.

ఎక్కువ ఆలస్యం లేకుండానే గుర్రపు బగ్గీ సిసారియా వైపు పరుగు తీసింది. యెరూషలేము వైపు మళ్ళిన శిష్యులను చూసి, సౌలు మొదటిసారిగా దుఃఖపూరిత మయ్యాడు. ఇంత అనుబంధం, ఇంత తక్కువ సమయంలో కేఫాగారితో ఎలా కలిగింది అనుకున్నాడు. ఎన్నో సంవత్సరాలుగా కలసి వుండి ఇప్పుడు విడిపోతున్నట్లుగా అనిపించింది. మరలా ఎప్పుడు కలుసుకుంటాము? అయినా ఇప్పుడు తన జీవితానికి తను కర్తకాడు కదా! అనుకున్నాడు సౌలు. ప్రక్కనే కూర్చున్న బర్నబా ఆలోచిస్తూ ఉన్నాడు.

అదే విధంగా కేఫాగారి జీవితం కూడా ఆయనకి తెలియకుండానే నడిపించబడుతుంది. కేఫాగారు, ఒకసారి ఒక వ్యక్తితో మాట్లాడుతూ ఉండగానే ఆ వ్యక్తి ప్రాణాలు విడిచాడు. ఒకసారి ఒక వ్యక్తితో మాట్లాడుతున్నప్పుడే అతను స్వస్థత పొందాడు. కనుక తన జీవితం తనకు తెలియకుండానే ప్రభువు చిత్తానుసారముగా నడిపించ బడుతుంది. కనుక మరలా ప్రభువు చిత్తము ఎప్పుడో. పదిగంటల సమయానికి బగ్గీ సిసారియా పట్టణంలో ప్రవేశించింది. సౌలు ఆలోచిస్తున్నాడు.

ఇప్పుడు తన దగ్గర సామానులు ఏమీ లేవు తను ధరించిన దుస్తులు కాక మరొక జత, ఈ రోజుకు సరిపోయే ఆహారము. బగ్గీ దిగిన తర్వాత, రేవు వైపుగా నడక సాగించాడు. తను ఈ పట్టణంలో నాలుగు సంవత్సరాల క్రితం వచ్చినప్పుడు కోటీశ్వరుడు. తన సామాను మోసుకొని రావడానికి బానిసలు. తన వస్త్రధారణ చూచిన వారెవరైనా తమ దారిన పోయే ముందు, మరోసారి చూసేవాళ్ళు. నేడు తన ఉనికిని కూడా ఎవరూ పట్టించు కోరు.

రేవుకి చేరేటప్పటికి మధ్యాహ్నం అయింది. రేవులో పనిచేసే వారందరూ మధ్యాహ్న భోజనానికి వెళ్తున్నారు. ఓడ కొరకు రేవులో విచారిస్తే రేపు సాయంకాలం వరకు తార్సు వైపు వెళ్ళే ఓడ లేదని చెప్పారు. అయితే అయిఫా మీదుగా క్రేతు వెళ్ళే ఓడ ఇప్పుడు సిద్దంగా ఉంది అని చెప్పారు.

ఇది దేవుని చిత్తము అనుకున్నారు. అయిఫా రేవులో దిగి కర్మేలు పర్వతము దగ్గర ఒకరోజంతా గడిపి, రేపు సాయంకాలం తార్సు వెళ్ళే ఓడ ఎక్కవచ్చు అనుకున్నాడు.

ఓడ కేవు చెల్లించి అందులో ప్రవేశించిన తర్వాత బర్నబాగారితో కొంచెం మాట్లాడి ఎడబాటుకై ఒకరినొకరు కౌగలించుకున్నారు. అంత భారీమనిషి అయినా, బర్నబాగారు చిన్నపిల్లవానిలా కృంగిపోయాడు. సౌలును ముద్దుపెట్టుకొని ఓడ దిగి పట్టణం వైపు ప్రయాణం సాగించాడు.

తనకు ఇచ్చిన గది, తను భోజనం చెయ్యడానికి అనువుగా ఉంది. ఇప్పుడు యూదా మతేతరులైన శిష్యులతో కలిసి భోజనం చెయ్యటానికి ఇష్టపడినా, హృదయము ఒంటరితనాన్ని కోరుతుంది. తరతరాలుగా తన రక్తంలో జీర్ణించుకొని పోయిన ఈ కులగర్వం ఎప్పుడు కరిగిపోతుందో అనుకున్నాడు. భోజనం ముగించి ఓడ పై భాగములో నిలబడితే సిసారియా పట్టణం యొక్క అందమంతా కనబడుతుంది. ఒకప్పుడు పాలస్తీనాను తన సొంత దేశముగా భావించేవాడు. కాని ఇప్పుడు అన్ని

దేశాలు, సమస్త ప్రజలు తన సొంతమైనట్లు కనబడుతుంది. తనకు అప్పగింపబడిన కృపననుసరించి పాపమునకు గురై శాపములో ఉన్న ఈ భూమి, ఆయన పవిత్ర రక్తప్రోక్షణతో పునీతమైంది.

ఓడ చిన్నగా నడక ప్రారంభించి వేగాన్ని అందుకునిది. మధ్యధరా సముద్రంలో ఈ ఓడ ఇప్పుడు ఒంటరిదై పోయింది. మానవులు చేసే కల్మషమంతా సముద్రంలో కలసిపోతున్నా, ఇంతదూరం ఆ కల్మషము చేరుకోలేదు. అందువల్ల నీళ్ళు స్ఫటికమువలె తెల్లగా కనబడుతున్నాయి. సిసారియా నుండి నాలుగు మైళ్ళు సముద్రంలోకి వెళ్ళిన తర్వాత ఉత్తరం వైపుగా ఓడ ప్రయాణం చేస్తుంది.

నాలుగు సంవత్సరాల క్రితం యెరూషలేముకు ఇదే సముద్రంపై ప్రయాణం చేసేటప్పుడు మహాసభ సభ్యత్వం తీసుకోవడానికి యెరూషలేము వెళ్తున్నాననే గర్వం ఉండేది. ఇప్పుడు దేవుని కృప వలన ఆయన రక్షణలోకి ప్రవేశించి నజరేయుని సాక్షిగా జీవించవలసిన తను, మరణానికి భయపడి పిరికివానివలె పారిపోతున్నాడు, ఇది సిగ్గుచేటు కదా అనుకున్నాడు. కొంచెంసేపు తన ప్రయాణం దైవ చిత్తానుసారమని భావించి హృదయం నెమ్మదిగా ఉండటానికి ప్రయత్నించాడు. మరలా తను మానవుల మాటలనుబట్టి తన విషయమైన దేవుని చిత్తముకు లోబడలేదేమో అనిపిస్తుంది. ఓడలో ఉన్న ప్రతి ఒక్కరితో యేసుని గురించి మాట్లాడాలని, ఆయనే క్రీస్తు అని చెప్పాలని, మన రోగములను, మన సంకటములను, ఆయన సిలువ మీద భరించెనని, మరణమును గెలిచి లేచినాడని, తను ఆనను చూచినట్లు చెప్పాలనే ఆరాటము.

ఒక గంట ప్రయాణంలోనే తూర్పు దిక్కున కర్మేలుకొండ కనబడుతుంది. ఆ కొండ ఆకారం చూచినా హృదయంలో ఆరాటం కలుగుతుంది. పోయినసారి ఈ కొండను వదలి వెళ్ళేటప్పుడు ఆరునెలల్లో మరల ఈ కొండను సందర్శిం చాలని అనుకున్నాడు. కాని నాలుగు సంవత్సరాలు దాటి పోయాయి. కాలం ఇంత వేగంగా ప్రయాణం చేస్తుంటే తను మరణించే లోపల ఎంతమందికి యేసుక్రీస్తు ప్రభువు సిలువవార్త చాటించగలడు?

ఇప్పుడు కర్మేలు కొండ సమీపిస్తుంది. ఓడ ఒడ్డుకు సమీపించేటప్పుడు నావికులు ఎక్కువ శ్రద్ధ తీసుకుంటారు. అందువలన ఓడలో నిద్రించే వాళ్ళైనా లేచి కూర్చుంటారు. ఇప్పుడు తనకు హడావిడి ఏమీ లేదు. ఈ ఓడని ఇక్కడ వదలి తార్సు వెళ్ళే ఓడ కొరకు వేచి ఉండాలి.

ఓడ ఒడ్డుకు చేరేటప్పటికి ఇంకా రాత్రి కాలేదు. కర్మేలు వైపు చూస్తూ కొంచెంసేపు నిలబడిపోయాడు.

"పర్వతములలో తాబోరు ఎట్టిదో
సముద్ర పాంతము లలో కర్మేలు ఎట్టిదో"

అన్న యిర్మీయా మాటలు గుర్తుకు వచ్చాయి. ఓడరేవులో నుండి బయటకు వచ్చేటప్పుడు తన సామాను వీపు మీద కట్టుకొని బయటకు వచ్చాడు. ఉదయాన్నే షునేము వెళ్ళే దారిలో నడక ప్రారంభించాడు. నాలుగు సంవత్సరాలకు రేవు చాలా మారిపోయినట్లుగా ఉంది. రేవు ప్రక్కన భవంతులు పొడుగునా సాగినట్లు కనబడు తున్నాయి. పూర్వం తను ద్రాక్షారసం తీసుకున్న పానీయ శాల ఏమీ మారలేదు. కాని ఆనాడు తను అక్కడికి వచ్చి నప్పుడు ఎంతో మర్యాద చేశారు. నేడు అసలు తనను ఒక మనిషి క్రిందనే లెక్క చెయ్యలేదు. తన చుట్టు ఉన్న వారందరిలో తను ధరించిన వస్త్రాలే చాలా తక్కువ ఖరీదైనవి.

కర్మేలు కొండ వెంబడి ఉత్తరంగా నడుస్తుంటే పడమటి వైపున హైఫా సముద్రపుగాలి తన వీపుకు తగిలి నడక ఆహ్లాదకరంగా ఉంది. గత మూడు సంవత్సరాలు సీనాయి అరణ్యం, అరేబియాలో ప్రతిరోజూ ధ్యానము చేస్తూ ఎంతో దూరం నడిచేవాడు. అందువలన నడక కష్టం అనిపించ లేదు. ఈ కర్మేలు కొండలు సముద్రం మొదలు పన్నెండు మైళ్ళు షునేము వరకు వ్యాపించి ఉన్నాయి. మొదటి కొండ మాత్రమే ఈ ప్రాంతము పేరు కర్మేలు అని పిలువబడింది. ఇప్పుడు ముఖ్య రహదారి నుండి బండ్లబాటలోకి కుడివైపు తిరిగి, పడమర వైపు చూస్తే ఈ కొండమీద ఉన్న అనేకమైన గుహలు కనబడుతున్నాయి. **(సశేషం)**

సీరియల్

# యౌవనస్థుడైన జార్ చక్రవర్తి



## (లియో టాల్‌స్టాయ్)

"నీవు పల్లెలలో కూడా సారాయి అమ్మడానికి కాగితాల మీద సంతకము చేశావుగా!" అన్నాడు అపరిచితుడు రాజుతో.

"ఔను!" అన్నాడు రాజు.

"వీరు ఎక్కువకాలం జీవించరు" అన్నాడు అపరిచితుడు.

"ఇప్పుడేమయింది?" అన్నాడు రాజు.

"వీళ్ళు ఎప్పుడు త్రాగుతూనే ఉంటారు" అన్నాడు అపరిచితుడు.

"ఈ పిల్లవాడికి తొమ్మిది సంవత్సరాలు లేవు. కాని ఎప్పుడు తాగుతూనే ఉన్నాడు" అన్నాడు ఇంటి యజమాని.

"ఇంట్లో అందరు త్రాగుతూనే ఉన్నారు" అన్నది ఓ చిన్న అమ్మాయి.

"ఇది సారాయి అంగళ్ళు పల్లెలలో ఎక్కడ పడితే అక్కడ పెట్టినందు వలన ఎక్కువమంది ప్రతి సంవత్సరం చచ్చిపోతున్నారు" అన్నాడు అక్కడున్న ఓ యవ్వనస్తుడు.

"ఇక్కడ పెట్టిన సారాయి అంగడి మూసివెయ్యడానికి చట్టము అడ్డువస్తున్నది. అంగటివాడు నాకు చక్రవర్తి లైసెన్సు ఇచ్చాడు. ఈ అంగడి ఎవరు మూసివెయ్యలేరు అని అంటున్నాడు. ఈ గ్రామవాసులు మూడు రోజులుగా త్రాగినవాళ్ళు త్రాగినట్లే ఉన్నారు. ఈ సారాయి విషముతో సమానమైనది. అయినా ఆదాయము కొరకు చక్రవర్తి వీటిని అభివృద్ధి పరస్తున్నారు. దీనివల్ల ఇప్పుడు జరిగే దుర్మార్గ కార్యాలన్ని జరుగుతున్నాయి" అన్నాడు ఇంటి యజమాని.

మరలా రాజు తలమీద తన చేతిని ఉంచాడు. ఇప్పుడు వారిద్దరు ఒక రైతు ఇంట్లో ఉన్నారు. ఒక యవ్వనస్తుడు ఒక వృద్ధుని ముఖం మీద కొడుతూ కొడుతూ చివరికి ఆ ముసలి వాని గడ్డం పట్టుకున్నాడు. ఆ ముసలివాడు చాలా బలహీనంగా ఉన్నాడు.

"నన్ను సైబీరియా జైలుకు పంపించినా సరే ఇతనిని నేను చంపేస్తాను" అంటున్నాడు ఆ యవ్వనస్తుడు.

ఇంతలో బాగా త్రాగిన ఆఫీసర్లు గదిలోనికి వచ్చి ఆ తండ్రిని తప్పించారు. ఆ తండ్రి చెయ్యి ఒకటి విరిగిపోయి నది. ఒక యవ్వనస్తురాలు బాగా త్రాగి ఓ రైతుతో సరస మాడుతుంది.

"వీళ్ళంతా పశువులవలె ప్రవర్తిస్తున్నారే!" అన్నాడు రాజు.

మరలా రాజు తలమీద పెట్టినపుడు వారిద్దరు లావుగా ఉండి బట్టనెత్తి కలిగిన ఓ న్యాయాధిపతి ఉన్న కోర్టు రూంలో ఉన్నాడు. ఒక తీర్పు పెద్దగా చదువబడుతుంది. ఓ చినుగు పాతది ధరించిన స్త్రీ నేలమీద కూర్చున్నది. ఎవరో ఆమె వద్దకు వచ్చి "లేచి నిలబడు" అని అరిచాడు.

"ఈ స్త్రీ ఒక కళ్ళంలోని గింజలను దొంగిలించింది. న్యాయము ఆమెకు రెండు నెలలు కారాగార శిక్ష విధిస్తుంది" అన్నాడు.

తర్వాత కేసు వరుస దొంగతనాలు గురించినది. ఈ తీర్పులు చదివిన తర్వాత న్యాయాధిపతి తన గదిలోనికి వెళ్ళాడు. ఈ కేసులు పెట్టిన ఆసామి న్యాయాధిపతి గది లోనికి వెళ్ళి ఆయనను అభినందించాడు.

మరలా రాజు కండ్లు తెరిచినప్పుడు ఒక గ్రామము మధ్యలో ఉన్నారు. అక్కడ ఆకలికి అల్లాడుతున్న చినిగి పోయిన గుడ్డలు ధరించిన ఓ తల్లి, పిల్లలు కనిపించారు.

తరువాత ఆ జైలులో వున్న ఒక వ్యక్తిని కొరడాలతో కొడుతున్నారు. తరువాత ఒక పెద్ద పోలీసు అధికారి లంచం తీసుకుంటున్నాడు. ఒక రాష్ట్ర గవర్నరు తేలికగా డబ్బు సంపాదించే విషయం మరొకరితో రహస్యంగా మాట్లాడు తున్నాడు. పన్నులు ఎగవేసిన వ్యక్తి దగ్గర ఒక అధికారి లంచం తీసుకుంటున్నాడు. మరొక జడ్జిమెంటు హాలులో

ఒక వ్యక్తిని కొరడాలతో కొట్టవలసినదిగా తీర్పు వెలువడింది. కొరడాలతో కొట్టడానికి అతనిని తీసుకొని వెళ్తుంటే "నన్ను వదలరా!" అని అతను ప్రాధేయపడుతున్నాడు.

"అలా కుదరదు" అంటున్నాడు అధికారి.

అతను పెద్దగా ఏడుస్తూ "యేసును కొట్టారు. ఆయన శ్రమపడ్డాడు. మమ్మల్ని కూడా శ్రమపడమని చెప్పాడు" అన్నాడు.

తరువాత వరుసగా వచ్చిన సీనులలో ఒక చర్చిలో అల్లర్లు, ఒక చర్చి ఫాదర్ వివాహము చెయ్యడానికి అంగీకరించకపోవడం, రైలు మార్గము వెయ్యడానికి పేదల ఇండ్లు పడగొట్టడం, ఆకలిదప్పులతో సైనికులు మట్టిలోను దుమ్ములోను కూర్చుని ఉన్నారు. బడిపిల్లల పాఠశాలల విషయంలో క్రొత్తచట్టము రావడం, ఒక శిలా విగ్రహము ప్రతిష్ఠించడం, చర్చిలో ఫాదర్ దొంగతనముగా డబ్బు కాజేయటం, క్రొత్తగా పోలీసులను చేర్చుకోవడం, ఒక వ్యక్తిని ఉరివెయ్యడం, మొదలగు సన్నివేశాలు వరుసగా... కనిపించాయి.

తరువాత కోటీశ్వరుడైన వాని కొడుకును సైన్యములో చేరకుండా మినహాయింపుకు – కడు బీద కుటుంబములోని ఒకే ఒక కుమారుని బలవంతంగా సైన్యములోకి పంపడం, యూనివర్సిటిలోని ఉద్యోగికి సైనికునిగా మినహాయింపుకు – పేరు వెలసిన వాయిద్యకారుని బలవంతంగా సైన్యంలో చేర్చడం, సైనికుల విపరీతమైన వ్యభిచారపు అలవాట్లు, రోగాలు వృద్ధి అవడం.

తర్వాత సైన్యంలో నుండి పారిపోయిన సైనికుని బంధించడం, తన తల్లిని అవమానపరచిన ఓ ప్రభుత్వ ఉద్యోగిని కొట్టినందుకు ఆ తల్లి కుమారులను అరెస్టు చేసి మరణశిక్ష విధించడం, పారిపోయిన ఓ సైనికుని కొరడాలతో కొట్టినపుడు అతను చనిపోవడం, సైనికుల సొమ్మును అపహరించిన ఓ అధికారి ఆగడాలు, ఇదంతా త్రాగుబోతుతనము, వ్యభిచారము, జూదము వలన అధికారుల ఆగడాలు.

సామాన్య ప్రజల సంగతేమిటి? పిల్లలు సగము ఆకలితోనే నకనకలాడిపోతుండుట, దుఃఖము, విచారము, అదే సమయములో మంత్రులు వారి వత్తాసులు అధికమైన సదుపాయాలతో ఇతరులను, బీదలను బాధించుట.

"అయితే మానవత్వం కలిగిన మనుష్యులు ఎక్కడున్నారు?" అన్నాడు రాజు.

"వారెక్కడ ఉన్నారో నేను చూపిస్తాను" అన్నాడు అపరిచితుడు. "ఇదిగో ఇక్కడ ఒక స్త్రీ ఒకేగదిలో ఒంటరిగా బంధించబడింది. ఇక్కడ ఓ యవ్వనస్తురాలు సైనికులచే చెరుపబడింది. ఇక్కడ ఒక మనుష్యుడు దెబ్బలవలన కుమిలిపోయి పడివున్నాడు. ఇక్కడ స్త్రీలు కొరడా దెబ్బలచే పడిపోయివున్నారు. ఇంకా చాలామంది ఉన్నారు. వందల వేలమంది మంచి మనుష్యులు జైళ్ళలో మగ్గుతున్నారు. కొందరు పనికిమాలిన చదువు వలన పాడైపోయారు. ఈ విద్యావిధానము వెర్రివెధవలు రూపొందించినవి. పిల్లల మనస్తత్వాలు ఈ చదువుల వలన వారిని మనుష్యులుగా మార్చడంలేదు. ఈ చదువుల వలన సాంఘిక దురాచారాలు పేట్రేగినవి. ఇదంతా గోధుమలను గురుగులుగా మార్చే పద్ధతులు. నేటి సమాజము యవ్వనదశలోనే నాశనమైపోయింది. ఈ చిన్నవారిని, వారి సమాజమును నాశనము చేసినవారు శిక్ష తప్పించుకోలేరు. వీరంతా నీ పేరు మీద నాశనము చేయబడ్డారు. వీరిలో ఏ ఒక్కడు నాశనమైనా శిక్ష తప్పించుకోలేవు. నీ పేరు మీద దుర్మార్గము జరుగుతున్నది. అయితే వీరందరిమీద నీకు అధికారము ఉన్నది" అన్నాడు అపరిచితుడు.

"అయితే నన్ను ఏమిచెయ్యమంటారు? వీరిని ఈవిధంగా కొరడాలతో కొట్టడం, హింసించడం చంపడం నాకిష్టం లేదు కదా! అందరు క్షేమంగా ఉండాలని నా ఆకాంక్ష. నేనేవిధంగా సంతోషంగా ఉండాలని కోరుకుంటానో నా ప్రజలు అలానే ఉండాలని భావిస్తాను. నా పేరు మీద జరిగే ఈ దురాగతాలకు నేనే బాధ్యుడనా? నేనేమి చెయ్యాలి? ఈ బాధ్యతలనుండి విడుదల పొందడానికి నేనేమి చెయ్యాలి? వీటన్నిటికి నేను బాధ్యుడనంటే ఒప్పుకోను. వీటిలో వందో భాగమైనా నేనే కారకుడనని తెలిస్తే

నన్ను నేను తుపాకీతో కాల్చుకోవడానికి సిద్ధమే. ఈ దుర్మార్గ తను నేనేవిధంగా రూపుమాపగలను? ఈ రాజ్యమునకు నేనే పరిపాలకుడను. ఈవిధముగా కొనసాగితే ఇక రాజ్యమే ఉండదు. అలా అయితే నేను ఏమి చెయ్యాలి? నన్ను నేను చంపుకోవాలా? అలా అయితే నేను ఏమి చెయ్యాలి? ఓ దేవుడా! దేవుడా! దేవుడా! నాకు సహాయం చెయ్యి" అని పెద్దగా ఏడ్చి నిద్రమేల్కొన్నాడు.

కొంచెం ఆలోచించి 'ఇదంతా కల' అని తెలుసుకొని ఎంతో సంతోషించాడు. కాని అతను మరలా ఆలోచించే కొలది ఇదంతా నిజమేననిపిస్తుంది. తన బాధ్యత ఇందులో చాలా ఉన్నది. తను కలలో చూసింది అంతా యదార్థమని అనిపించింది. ఈ భావన అతని భార్యను గురించి, తన ఆనందం గురించిన అభిలాషను పూర్తిగా తుడిచివేసింది. తన బాధ్యత ఎంత గొప్పదో అర్థమవుతుంది. 'ఇప్పుడేమి చెయ్యాలి?' అని ఆలోచించసాగాడు.

ఈ భారమైన వేదనతో ప్రక్క గదిలోకి నడిచాడు. తన భార్య అలా నిలుచుని ఉన్నది. ఆమెకు ఎదురుగా ఒక పెద్దాయన తన తండ్రి స్నేహితుని సలహాదారుడు ఆమెతో మాట్లాడుతున్నాడు. ఆ యువరాజు నేరుగా ఆ పెద్దాయన వద్దకు వెళ్ళి తనకు వచ్చిన కలను గూర్చి చెప్పాడు. తనకు కలిగిన సందేహాలను అతనిముందుంచాడు.

ఆ పెద్దాయన ఇలా అన్నాడు – "నీ భావాలు చాలా ఉన్నతమైనవి. ఎన్నదగినవి. నేను అరమరికలేకుండా మాట్లాడుతాను. క్షమించాలి. నీ బాధ్యతలను గొప్పగా గ్రహించిన దయగల చక్రవర్తివి. మొదటిగా నీవు ఊహించి నట్లుగా పరిస్థితులు ఇక్కడ లేవు. బీదలుగా ఉన్నవారు పనీపాట చెయ్యక బీదలు అయ్యారు. వారు బీదలుగా ఉండడానికి వారే కారకులు. తప్పిదము చేసినవారే శిక్షించ బడుతుంటారు. ఎప్పుడైనా అమాయకులు శిక్షించబడితే అది ఒక యాక్సిడెంటు అనుకోవాలి. కాక అది దేవుని చిత్తమై ఉండాలి. నీకు ఒకే బాధ్యత ఉన్నది. నీకు ఇవ్వబడిన అధికారమును సక్రముగా ఉపయోగిస్తూ నీ బాధ్యతలను నెరవేర్చాలి. నీ ప్రజలకు మంచి చెయ్యాలనే నీ భావన దేవుడు గమనిస్తున్నాడు. దేవుడు నిన్ను నడిపిస్తాడు. అవసర మైతే నిన్ను క్షమిస్తాడు. నీ అంతట నువ్వు ఏ తప్పు చెయ్య లేదు. కనుక క్షమాపణ ఉన్నది. ఎందుకంటే నీ తండ్రికి దేవుడు మానవాతీత శక్తిని ప్రసాదించాడు" అన్నాడు.

"దీని విషయం నీవేమంటావు?" అని తన భార్యని అడిగాడు రాజు.

"నేను స్వతంత్రమున్న దేశములో పెరిగాను కాబట్టి నా భావాలు మరో రకముగా ఉంటాయి. నీకు వచ్చిన కల విషయం నాకు సంతోషంగా ఉన్నది. నీకు ఉన్నతమైన బాధ్యతలు ఉన్నాయి. ఈ విషయం నేను చాలా ఆందోళన కలిగి ఆలోచించాను. కాబట్టి నీవు ఒక్కడివే భరించలేని భారమంతా కాకపోయినా కొంతైనా ఇతరులమీద మోప వలసియున్నది. నీ దగ్గర అత్యున్నతమైన అధికారము ఉంచుకొని నీ బాధ్యతలన్ని నీ క్రింది వారికి అప్పగించితే మంచిది" అన్నది.

ఈ మాటలు ఆమె పలుకగానే వారిమధ్య చాలా వాగ్వివాదము చోటుచేసుకున్నది. వారి మాటలన్ని వింటు న్నప్పటికి రాజు హృదయంలో ఇందాక అపరిచితుడు చెప్పిన భావాలు చిన్నగా మాట్లాడసాగాయి. కొంచెం సేపటికి పెద్దగానే వినిపించసాగాడు. "నీవు చక్రవర్తివి మాత్రమే కాదు అంటున్నది ఆ రాణి. నీవు కేవలం నిన్న ప్రపంచంలోనికి అడుగిడిన మానవ మాత్రుడవు. ఒకవేళ రేపు నీవు నిష్క్రమించవచ్చును కూడా! ఆ పెద్దాయన చెప్పి నట్లుగా నా చక్రవర్తి పాలనే కాక – కొన్ని బాధ్యతలు ఉన్నవి, మానవునికి దేవుడు ఏర్పరచినవి. నీ ఆత్మకి సంబం ధించిన బాధ్యతలు. ఆత్మను రక్షించుకోవాలి. అంతేకాక దేవుని రాజ్యాన్ని మానవుల మధ్య నెరవేరనివ్వాలి. ఇంతకు ముందు రాజులు ఏమిచేశారో అని కాదు, నీవు ఏమి చెయ్యాలని అనుకుంటున్నావు అది కాదు కాని దేవుడు నిన్ను ఏమిచెయ్యమంటున్నాడో అని ఆలోచించు".


**అతను కండ్లు తెరిచాడు. అతని భార్య అతని నిద్రలేపింది. గడిచిన మూడు అనుభవాలలో అతను ఏమి చెయ్య నిశ్చయించబడినది అది రాబోయే యాభై సంవత్స రాలలో చెప్పబడుతుంది. (సశేషం)**



రెవ.డా॥ కె.జోసఫ్

# రక్షకుడైన యేసుని గుర్తించని ప్రజలు

సుమారు రెండువేల సంవత్సరాల క్రితము దైవ కుమారుడైన యేసుక్రీస్తు మానవాళి పాప విమోచన కొరకు భూలోకమునకు వచ్చి శాంతి మార్గములను బోధించి అనేక అద్భుతములు చేసి సిలువలో తన పవిత్ర రక్తమును చిందించి మరణించి మూడు రోజులు అనంతరము మరణమును జయించి తిరిగి లేచిన సంగతి అందరికి విదితమే. ఎన్నో అద్భుతములు చేసినప్పటికీ యేసుని ఇప్పటి వరకు కూడా లోకం సరిగా అర్థం చేసుకోలేక పోతుంది.



ఆయన తన స్వకీయుల యొద్దకు వచ్చెను గాని వారు ఆయనను అంగీకరించలేదు. ఎందుకంటే ఆయన వారి ఉద్దేశ్యముల ప్రకారం వారికి గోచరము కాలేదు (యోహాను 1:11). ఆయన శిష్యులు సైతము ఆయనను సరిగా గుర్తించలేదు.

ఒకసారి వారి పడవ తుపానులో చిక్కుకొనగా ఆయన గాలిని సముద్రమును గద్దించి నిమ్మళింప చేసినప్పుడు సైతము "ఈయన ఎవరో గాలియు, సముద్రము ఈయనకు లోబడుచున్నవి" అన్నారు గాని, ఆయన దైవకుమారుడైన క్రీస్తు అని గుర్తించలేకపోయారు (మార్కు 4:41). అనేక సార్లు ప్రభువు తాను యెరూషలేములో పెద్దలచేతను ప్రధాన యాజకుల చేతను, శాస్త్రులచేతను హింసలు పొంది, చంపబడి మూడవదినమున లేచుట అగత్యమని శిష్యులకు తెలియజేసినప్పటికీ వారు యేసుని రక్షకునిగా గుర్తించ లేదు. మత్తయి 16:21; 17:22; 20:17,28.

యోహాను 21వ అధ్యాయములో శిష్యులు యేసుని వదలి తిరిగి వారి వృత్తిలోనికి దిగి చేపలు పట్టుటకు వెళ్ళి ఆ పనిలో అపజయము పొంది, విచారములో నిస్పృహలో ఉన్నప్పుడు యేసు వారిని విడువక సూర్యోదయమగుచుండగా వారి దగ్గర నిలిచి, వారిని పిలిచి సహాయ పడినప్పుడు కూడా ఆయనను సరిగా గుర్తించలేదు.

యేసుని ఎంతగానో ప్రేమించిన మగ్దలేనే మరియ సైతము ఆ ఆదివారం ఉదయమున యేసుని కలిసినప్పుడు తోటవాలిగా గుర్తించినది కాని యేసుగా గుర్తించలేదు. యేసు ఆమెను పేరుపెట్టి మరియా అని పిలిచినప్పుడు "రబ్బూనీ" అని అనగా బోధకుడు అని గుర్తించిందేగాని ఈయన పాపుల రక్షకుడైన క్రీస్తుగా గుర్తించలేదు.

అంతేకాదు నేటి క్రైస్తవులు సైతము యేసుని యేసుగా (రక్షకునిగా) గుర్తించలేకపోతున్నారు. యేసు దేవుడే అని అంటున్నారు గాని, ఆయన మన రక్షకుడు అని విశ్వసించ లేకపోతున్నారు. ఈనాడు ప్రపంచంలో అనేకులు యేసు ఎటువంటి రోగములనైన స్వస్థపరచగల వైద్యుడుగా గుర్తిస్తు న్నారుగాని యేసు శక్తిగల దైవకుమారుడు, పరలోక మందును, భూమి మీదను సర్వాధికారముగల దైవమని గుర్తించలేక పోతున్నారు. యేసు దేవుడే కాని, మనకు ఉద్యోగములు ఇవ్వలేని వాడని, ధనము ఇవ్వలేని వాడని, ఘనత ఇవ్వలేని వాడని యేసుని ఎరుగమని బొంకు తున్నారు. దేవుని వాక్యములో ఆయనయందు ధనఘనతలు కలవని ఘోషిస్తున్నది.

బుద్ధి,జ్ఞానముల సర్వసంపదలు ఆయనయందు గుప్తమై యున్నవి (కొలస్సీ. 2:3). ఇది తెలిసి కూడా ఆయనయందు నమ్మిక ఉంచలేకపోతున్నారు. మనలను ధనవంతులుగా చేయుటకే ఆయన దరిద్రుడుగా మారవలసి వచ్చినదని గుర్తెరుగలేకపోతున్నారు. మన దేవుడు మహా రోషముగల దేవుడు. తన బిడ్డలను తలగానే ఉంచుతాడుగాని తక్కువగా ఉంచడని తెలిసి కూడా నమ్మలేకపోతున్నారు. నమ్ముట నీ వలనైతే నమ్ము వానికి సమస్తము సాధ్యమేనని మార్కు 9:23లో చెప్పబడిన మాటలు తెలిసినప్పటికీ నమ్మకుండా ఉన్నాము. యేసు నిమిత్తము, సువార్త నిమిత్తము ఏది త్యాగము చేసినప్పటికీ నూరంతలుగా తిరిగి ఇయ్యబడును అని చెప్పినప్పటికీ దేవునికి ఇచ్చుటయందు నమ్మిక ఉంచలేక పోతున్నారు. మార్కు 10:29,30.

దశమ భాగము దేవునికి సమర్పించితే ఆకాశ వాకిళ్ళు విప్పి పట్టజాలనంత విస్తారముగా దీవెనలను కుమ్మరిస్తానని (మలాకి 3:10). పలికిన మాటలను విశ్వసించలేక పోతున్నారు. ఆకాశము భూమి గతించునుగాని నా మాటలు గతించవని (లూకా 2:33) యేసు చెప్పిన మాటలను విశ్వసించలేకపోతున్నారు. యేసుని రక్షకునిగా దైవకుమారునిగా విశ్వసించిన వారందరికీ వారు కోరుకున్న విధంగా మేలు జరిగింది.

రక్తస్రావముగల స్త్రీ యేసు వస్త్రపు చెంగులో సైతము శక్తిగలదని నమ్మి, వస్త్రపు చెంగును ముట్టి, యేసులో నుండి ప్రభావము లాగుకొని స్వస్థత పొందినది (లూకా 8:43,44) శతాధిపతి యూదుడు కాకపోయినప్పటికీ ప్రభువు యొక్క దైవత్వమును అధికారమును గుర్తెరిగి తన దాసునికి స్వస్థత పొందగలిగాడు (లూకా 7:6-8). ఆలాగుననే కుష్ఠురోగి, పక్షవాయువు గలవారు ఇంకా అనేకులు విశ్వసించి మేలులను పొందారు.

కనుక ప్రియ క్రైస్తవ సహోదరులారా! యేసుని మనం ఏ విధంగా గుర్తిస్తున్నామో పరీక్షించుకుందాం. యేసు దేవుడే కాని మనలను సంకటముల నుండి రక్షించలేని వానిగా గుర్తిస్తున్నామా?

నీవు నమ్మిన యెడల దేవుని మహిమను చూచెదవు (యోహాను 11:40) అని చెప్పి చనిపోయిన లాజరుకు ప్రాణమిచ్చిన ప్రభువు, యాయీరు కుమార్తె చనిపోయినదని వర్తమానము వచ్చినప్పుడు భయపడకు నమ్మిక మాత్రము ఉంచుమని (మార్కు 5:36) చెప్పి ఆ బిడ్డను బ్రతికించిన ప్రభువు మనము యేసుని శక్తిని గుర్తెరిగి ఆయనయందు నమ్మిక యుంచినట్లయితే అసాధ్యమైన కార్యములను సహితం సాధ్యపరచగలడు. దేవునికి అసాధ్యములైనవి ఏవీ లేవు. సమస్తము ఆయనకు సాధ్యము. పరలోకమును, భూమి మీదను ఆయనకు సర్వాధికారము ఇయ్యబడి యున్నది.


కనుక యేసునందు విశ్వాసముంచి, యేసుని రక్షకునిగా గుర్తెరిగి మన కార్యములను సాధించుకుందాము. ఆయన ఎంతైనా నమ్మదగినవాడు. ఆమేన్!



**పాఠకులకు, చందాదారులకు, ప్రకటన కర్తలకు, శ్రేయోభిలాషులకు**

# పునరుత్థాన పండుగ శుభాకాంక్షలు

**- ఎడిటర్ మరియు సిబ్బంది**



# బైబిలు చరిత్ర

సేకరణ: రెవ.డా॥ కె.జోసఫ్

**గలతీ**-పరిచయం

అబద్ధబోధ మూలంగా పెడత్రోవ పట్టిన విశ్వాసులను నిజమైన విశ్వాసానికి ఆచరణకు మళ్లించడానికి పౌలు ఈ పత్రిక వ్రాశాడు. దేవుడు తనను యూదేతరులకు అపొస్తలుడుగా ఎన్నుకున్నాడని పౌలు వివరిస్తూ, క్రీస్తులోని విశ్వాసంద్వారా జనించే ప్రేమ క్రైస్తవ నడతకు పునాది అని చెప్పడం ఈ పత్రికలో విశేషాంశం.

**విషయసూచిక**

పరిచయం 1:1-10
అపొస్తలుడుగా పౌలుకున్న ప్రామాణికత 1:11-2:21
దేవుని కృపాసువార్త 3:1-4:31
క్రైస్తవ స్వాతంత్ర్యం, మరియు కర్తవ్యం 5:1-6:10
ముగింపు 6:11-18

**ఎఫెసీ**-పరిచయం

"సమస్తమును క్రీస్తునందు ఏకముగా సమకూర్చవలెనని" (1:10) దేవునికున్న సంకల్పాన్ని విశదీకరిస్తూ పౌలు ఈ పత్రిక వ్రాశాడు. క్రైస్తవులందరూ యేసు క్రీస్తును బట్టి ఏకతతో దేవుని సంకల్పానుసారం అర్థవంతంగా జీవించాలని పౌలు ఈ పత్రికలో మనవి చేస్తున్నాడు. శరీరం శిరస్సు ఇల్లు మూలరాయి భార్య వంటి అలంకార పదప్రయోగంతో పౌలు క్రీస్తులోని ఏకతను వర్ణించడం ఈ పత్రికలో విశేషాంశం.

**విషయసూచిక**

పరిచయం 1:1-2
క్రీస్తు, మరియు సంఘం 1:3-3:21
క్రీస్తులో నూతన జీవం 4:1-6:20
ముగింపు 6:21-24

**ఫిలిప్పీ**-పరిచయం

రోమా సామ్రాజ్యంలోని మాసిదోనియా ప్రాంతంలో పౌలు స్థాపించిన తొలి సంఘమైన ఫిలిప్పీ సంఘానికి పౌలు ఈ పత్రిక వ్రాస్తున్నాడు. ఈ పత్రిక రచనా కాలంలో పౌలు చెరసాలలో ఉండడం, మరో వైపు అతని పట్ల సాటి క్రైస్తవుల వ్యతిరేకత మరియు ఫిలిప్పీ సంఘంలో అబద్ధబోధ గమనించదగిన అంశాలు. యేసు క్రీస్తులోని ప్రగాఢ విశ్వాసంద్వారా పౌలుకు కలిగిన ఆనందం మరియు ఆత్మస్థైర్యం, క్రైస్తవుల్లో ఐకమత్యం మరియు పట్టుదల ఉండాలని పౌలు బోధించడం ఈ పత్రికలో కనిపించే విశేషాంశాలు.

**విషయసూచిక**

పరిచయం 1:1-11
పౌలు కెదురైన వ్యక్తిగత పరిస్థితులు 1:12-26
క్రీస్తులో జీవితం 1:27-2:18
తిమోతిపట్ల ఎపఫ్రొదితుపట్ల పౌలు తలంపులు 2:19-30
శత్రువుల గురించి అపాయాల గురించి హెచ్చరికలు 3:1-4:9
పౌలు, మరియు అతని ఫిలిప్పీ స్నేహితులు 4:10-20
ముగింపు 4:21-23

**కొలొస్స**-పరిచయం

చిన్నాసియాలో ఎఫెసుకు తూర్పున ఉన్న కొలొస్స పట్టణంలో ఉన్న సంఘానికి పౌలు ఈ పత్రిక వ్రాశాడు. పౌలు ఈ సంఘాన్ని స్థాపించకపోయినప్పటికీ సంఘం పట్ల బాధ్యతతో వ్యవహరించి ఎఫెసునుండి అక్కడికి పనివారిని పంపించాడు. పౌలు కొలొస్స సంఘంలో ప్రబలంగా వ్యాపించిన అబద్ధ బోధలను వ్యతిరేకిస్తూ క్రీస్తు ద్వారా మాత్రమే రక్షణ కలుగుతుందని నొక్కి చెబ్తూ ఈ పత్రిక వ్రాస్తున్నాడు. తుకికు, అతనితోబాటు ఒనేసిము కొలొస్స సంఘాన్ని దర్శించి ఈ పత్రికను అందజేయడం విశేషాంశం.

**విషయసూచిక**

పరిచయం 1:1-8

క్రీస్తు స్వభావం, మరియు కార్యం 1:9-2:19

క్రీస్తులో నూతన జీవం 2:20-4:6

ముగింపు 4:7-18

**1 థెస్సలొనీక**-పరిచయం

రోమా సామ్రాజ్యంలోని మాసిదోనియా ప్రాంతానకి థెస్సలొనీక ముఖ్యపట్టణం. పౌలు ఫిలిప్పీని విడిచిపెట్టిన తర్వాత థెస్సలొనీకలో సంఘాన్ని స్థాపిస్తాడు. అయితే యూదేతరుల మధ్య పౌలు పరిచర్యను వ్యతిరేకించిన కొందరు థెస్సలొనీక యూదులు పౌలుపట్ల విముఖత చూపినందువల్ల పౌలు థెస్సలొనీకను విడిచి బెరయకు వెళ్లాడు. థెస్సలొనీక సంఘంలో ఉన్న విశ్వాసప్రేమలను బట్టి దేవునికి కృతజ్ఞత చెల్లిస్తూ క్రీస్తు రెండవ రాకడ విషయంలో తలెత్తిన ప్రశ్నలకు బదులిస్తూ పౌలు ఈ పత్రిక వ్రాశాడు.

**విషయసూచిక**

పరిచయం 1:1

కృతజ్ఞత, మరియు స్తుతి 1:2-3:13

క్రైస్తవ నడత విషయంలో కొన్ని హెచ్చరికలు 4:1-12

క్రీస్తు రెండవ రాకడ గురించి ఉపదేశం 4:13-5:11

తుది హెచ్చరికలు 5:12-22

ముగింపు 5:23-28

**2 థెస్సలొనీక**-పరిచయం

క్రీస్తు రెండవ రాకడ గురించి థెస్సలొనీక సంఘంలో కొనసాగుతున్న అనిశ్చయతను రెండవ రాకడ జరిగి పోయిందనే కలవరాన్ని తొలగించడానికి పౌలు ఈ పత్రిక వ్రాశాడు. క్రీస్తు ద్వితీయాగమనానికి ముందు ధర్మవిరోధి దుష్టక్రియలు ముమ్మరమవుతాయని పౌలు ఈ పత్రికలో పేర్కొన్నాడు. శ్రమలు హింసల్లో ధైర్యంగా ఉంటూ విశ్వాసాన్ని కాపాడుకోవాలని జీవనోపాధికొరకు కష్టపడి పనిచేయాలని నిర్విరామంగా మంచి పనులు చేయాలని పౌలు సెలవివ్వడం ఈ పత్రికలోని విశేషాం శాలు.

**విషయసూచిక**

పరిచయం 1:1-2

స్తుతి, మరియు ప్రశంస 1:3-12

క్రీస్తు ఆగమనం గురించి హెచ్చరికలు 2:1-17

క్రైస్తవ నడత గురించి హెచ్చరికలు 3:1-15

ముగింపు 3:16-18

**1 తిమోతి**-పరిచయం

చిన్నాసియాకు చెందిన యువక్రైస్తవుడైన తిమోతి పౌలుకు పరిచర్యలో సహచరుడు, సహాయకుడు కూడా. అబద్ధబోధను వ్యతిరేకిస్తూ, సంఘపరిపాలనలో సంఘారాధనలో క్రమాన్ని నిర్దేశిస్తూ, సహవిశ్వాసులపట్ల తిమోతి బాధ్యతలను గుర్తు చేస్తూ పౌలు తిమోతికి ఈ పత్రిక వ్రాశాడు.

**విషయసూచిక**

పరిచయం1:1-2

సంఘపరిపాలన, సంఘాధ్యక్షులకు సూచనలు 1:3-3:16

పరిచర్య విషయంలో తిమోతికి సూచనలు 4:1-6:21

**2 తిమోతి**-పరిచయం

పౌలు తన పరిచర్యలో సహచరుడు మరియు సహాయకుడైన తిమోతికి వ్యక్తిగత సూచనలిస్తూ ఈ పత్రిక వ్రాశాడు. సహనం కలిగివుండాలని సాక్ష్యాన్ని కాపాడుకోవాలని సత్యమై బోధకు కట్టుబడి వుండాలని నిష్ప్రయోజనమైన వాదనలకు దూరంగా ఉండాలని పౌలు తిమోతిని హెచ్చరించడం ఈ పత్రికలోని విశేషాంశాలు.

**విషయసూచిక**

పరిచయం 1:1-2

స్తుతి, మరియు హెచ్చరికలు 1:3-2:13

సలహాలు, మరియు సూచనలు 2:14-4:5

పౌలు స్వంత అనుభవం 4:6-18

ముగింపు 4:19-22

**తీతు**-పరిచయం

యూదేతరుడైన తీతు క్రైస్తవుడైన తర్వాత పౌలుకు పరిచర్యలో సహచరుడుగా మరియు సహాయకుడుగా ఉన్నాడు. క్రేతులోని సంఘాన్ని పర్యవేక్షించడానికి పౌలు యువకుడైన తీతును అక్కడికి పంపించాడు. సంఘాధ్యక్షులకు సూచనలు సంఘంలోని భిన్నవర్గాలవారికి (వయోవృద్ధులు యౌవనస్త్రీలు వృద్ధస్త్రీలు యువకులు బానిసలు) సలహాలు, క్రైస్తవ నడతలో శాంతి సామరస్యం వుండాలంటే హెచ్చరికలు ఈ పత్రికలోని విశేషాంశాలు.

**విషయసూచిక**

పరిచయం 1:1-4

సంఘాధ్యక్షులు 1:5-16

సంఘంలో వివిధ వయస్సుల్లో ఉన్నవారు 2:1-15

సలహాలు, మరియు హెచ్చరికలు 3:1-11

ముగింపు 3:12-15

**ఫిలేమోను**-పరిచయం

ఫిలేమోను కొలొస్సలోని సంఘంలో ఒక ప్రముఖుడు. ఒనేసిము ఇతని బానిస. తన యజమానినుండి తప్పించుకొని పారిపోయిన ఒనేసిము చెరసాలలో పౌలును కలుసుకున్నాడు. పౌలు ద్వారా ఒనేసిము క్రైస్తవుడయ్యాడు. ఒనేసిమును తిరిగి చేర్చుకొమ్మని పంపిస్తూ అతణ్ణి బానిసగా కాక క్రైస్తవ సహోదరుడుగా స్వాగతించమని కోరుతూ పౌలు ఫిలేమోనుకు ఈ పత్రిక వ్రాశాడు.

**విషయసూచిక**

పరిచయం 1-3 వచనాలు

పౌలు ఫిలేమోనును అభినందించడం 4-7 వచనాలు

ఒనేసిము తరపున మనవి 8-22 వచనాలు

ముగింపు 23-25 వచనాలు

**హెబ్రీ**-పరిచయం

కొంతమంది క్రైస్తవులు తమ విశ్వాసాన్ని విడిచిపెట్టడానికి సిద్ధమైన తరుణంలో ఈ పత్రికను రచించడం జరిగింది. రచయిత వారి విశ్వాసాన్ని బలపరుస్తూ యేసు మహత్తును ఆధిపత్యాన్ని అధికారాన్ని పత్రికలో ప్రస్తావించాడు. ప్రవక్తలకంటె దేవదూతలకంటె మోషే కంటె క్రీస్తు ఉన్నతుడని ఆయన నిత్యుడైన ప్రధానయాజకుడని రచయిత ప్రస్తావించడం ఈ పత్రికలో విశేషాంశం.

**విషయసూచిక**

పరిచయం: క్రీస్తు దేవుణ్ణి ప్రత్యక్షపర్చాడు 1:1-3

క్రీస్తు దేవదూతలకంటె ఉన్నతుడు 1:4-2:18

క్రీస్తు మోషేకంటె యెహోషువకంటె ఉన్నతుడు 3:1-4:13

క్రీస్తు యాజకత్వం ఉన్నతమైనది 4:14-7:28

క్రీస్తు నిబంధన ఉన్నతమైనది 8:1-9:28

క్రీస్తు స్వసమర్పణ ఉన్నతమైనది 10:1-39

విశ్వాసానికున్న ఔన్నత్యం 11:1-12:29

దేవునికి సంతోషం కలిగించేవి 13:1-19

ముగింపు ప్రార్థన 13:20-21

తుది పలుకులు 13:22-25

**(సశేషం)**



శ్రీమతి కె. రేచల్ జోసఫ్,
హన్నా ఉమెన్స్ ప్రెసిడెంట్


# తబితా

పరిశుద్ధ గ్రంథములో అపొస్తలుల కార్యములు 9:36లో "మరియు యొప్పెలో తబితా అను ఒక శిష్యురాలు ఉండెను; ఆమెకు భాషాంతరమున దొర్కా అని పేరు. ఆమె సత్క్రియలను ధర్మకార్యములను బహుగా చేసియుండెను" అని వ్రాయబడి యుండెను. ఆమె జీవితములోని కొన్ని ప్రాముఖ్యమైన గుణలక్షణా లను పరిశీలిద్దాం.

**1. ఆమె చురుకైనది :** ఆమెకు భాషాంతరమున దొర్కా అని పేరు. అనగా లేడి అని అర్ధము. లేడి చాలా చురుకైన జంతువు అని అందరికి తెలుసు. అందుకనే ఆమె తల్లి దండ్రులు లేడి అని అర్ధమిచ్చే దొర్కా అని పేరుపెట్టి ఉంటారు. లేడిలాగానే దొర్కా చురుకైనటువంటిది. చురుకుగా ఉండుట గొప్ప భాగ్య మని సామెతలు 12:27లో వ్రాయబడివుంది. ఈ దినాల్లో కొంతమంది ఏ పని పాట చేయకుండా బ్రతకడానికి చురు కుగా ఉంటారు. దొర్కా అయితే దైవకార్యక్రమాల్లో కుటుంబ విషయాల్లో సోమరిగా ఉండకుండా చురుకుదనంగా ఉంది. దేవుని బిడ్డలమైన మనము ఆయన మనకు అప్పగించిన పనిలో చురుకైన వారముగా ఉండాలి. విశ్వాసులకు సోమరితనము ఉండకూడదు. ఎందుకంటే సోమరితనము గాఢనిద్రలో పడవేయును.

**2. ఆమె ధర్మకార్యములు చేసింది:** ఆమె సత్క్రియలను ధర్మకార్యములను బహుగా చేసియుండెను. క్రైస్తవ జీవితంలో విశ్వాసముతో పాటు క్రియలు ఉండాలి. ఎందుకనగా క్రియలు లేని విశ్వాసము మృతము. యాకోబు 2:26, గలతీ.6:10. కాబట్టి మనకు సమయము దొరికిన కొలది అందరి యెడలను మేలు చేయుదము. విశేషముగా విశ్వాస గృహమునకు చేరిన వారి యెడలను మేలు చేయుదము. మనలో విశ్వాసముతో పాటు మంచి క్రియలు లోకానికి కనబడాలి. విధవరాండ్రకు దిక్కులేని వారికి పేదలకు దొర్కా అంగీలు, గుడ్డలు, చొక్కాలు కుట్టి ఇచ్చేది. 'మనుష్యులు మీ సత్క్రియలను చూచి పరలోక మందున్న మీ తండ్రిని మహిమపరచునట్లు వారి యెదుట మీ వెలుగు ప్రకాశింప నియ్యుడి' (మత్తయి 5:16). శతాధిపతియైన కొర్నేలి దైవభక్తితో పాటు ప్రజలకు బహు ధర్మము చేయుచు ఎల్లప్పుడు దేవునికి ప్రార్ధన చేయువాడు (అపొ.కా. 10:2). మన భక్తి జీవితము విశ్వాసముతో పాటు సాధ్యమైనంత వరకు సంఘము బయట ఉన్న వారికి మేలు చేసేవారముగా ఉండాలి.

గొప్ప శిష్యురాలిగా, చురుకైన స్త్రీగా సత్క్రియలను ధర్మ కార్యములను బహుగా చేసిన ఆమె హఠాత్తుగా చనిపోయింది. శవమును కడిగి మేడగదిలో పెట్టి లుద్దలో ఉన్న పేతురు దగ్గరకు శిష్యులు కబురు పంపారు. పేతురు వెంటనే బయలుదేరి వచ్చాడు. మేడగదిలోనికి ఆయనను తీసికొని వెళ్ళారు. విధవ రాండ్రందరు వచ్చి యేడ్చుచు దొర్కా తమతో కూడా ఉన్నప్పుడు కుట్టిన అంగీలను వస్త్రములను చూపుచు పేతురు ఎదుట నిలిచిరి. పేతురు అందరిని వెలుపలికి పంపి మోకాళ్ళూని ప్రార్ధన చేసి శవము వైపు తిరిగి తబితా లెమ్మనగా అమె కన్నులు తెరచి పేతురును చూచి లేచి కూర్చుంది. అతడామెకు చెయ్యి ఇచ్చి లేవనెత్తి పరిశుద్ధులను విధవరాండ్రను పిలిచి ఆమెను సజీవు రాలిగా వారికి అప్పగించెను. ఇది యొప్పెయందంతటు తెలిసి నప్పుడు అనేకులు ప్రభువునందు విశ్వాసముంచిరి. శిష్యురా లుగా, పరిచర్యలో చురుకైన వ్యక్తిగా ధర్మకార్యములు చేసిన దొర్కా పేతురు ప్రార్ధించగానే ఆమె తిరిగి సజీవురాలైంది. మరి కొంత కాలం దొర్కా జీవించాలని దేవుడు ఉద్దేశించాడు. మనము దొర్కా వలె యధార్ధమైన సేవ చేసినప్పుడు దేవుడు మన ఆయుష్కాల మును పొడిగించి బలమైన పాత్రగా మనలను వాడు కుంటాడు. అట్టి కృప పరిశుద్ధాత్ముడు మనకు దయచేయును గాక!



బ్రదర్ కె.సామ్రాట్

# గెత్సేమనే తోట

ప్రియులారా! కల్వరి కొండకు ఎక్కి, కల్వరి నాథుడిచ్చు కరుణా వాత్సల్యములను పొందుదము రండి.

ఇదిగో! మనము మొదటిగా గెత్సేమనే తోటకు వెళదాం! ఇది ఒలీవచెట్లతో నిండిన ఒక స్థలము. అంతేకాదు, ఒలీవ పండ్ల నుండి నూనె తీయు గానుగ ఇక్కడున్నది. అందుకే 'గెత్సేమనే' అనగా 'గానుగ' అని అర్థమునిచ్చు పేరు దీనికి పెట్టియున్నారు. ఈ తోట యెరూషలేమునకు తూర్పుగా నున్న కిద్రోను వాగుకు కొంచెము అవతల, ఒలీవ కొండకు దిగువన ఉన్నది. యేసుప్రభువుకు ఇది యెంతో ఇష్టమైన చోటు. ఆయన తరచుగా ఇక్కడ ఏకాంతముగా ప్రార్థించెడి వాడు. ఆయన అప్పగింపబడిన రాత్రి ఈ తోటలోనే ఉండెను. ఆ రాత్రి అక్కడ ఆయన లోకపాపభారమంతయు, పాపపు శిక్షంతయు భరించవలసి వచ్చినప్పుడు ఆ వేదనను సహించలేక పాపమెరుగని ప్రభువు, రోతకరమైన మన పాపములను మోయలేక మరింత ఆతురముగా ప్రార్థన చేయగా, ఆయన చెమట నేలను పడుచున్న గొప్ప రక్తబిందువులవలె ఆయెను (లూకా 22:44).

మన ప్రియ ప్రభువైన యేసుక్రీస్తు ఇచ్చట నేలమీద పడి మానవుల రక్షణ కొరకు కన్నీటితో, వేదనతో రక్తము కారునంతగా ప్రార్థించెను. ద్రాక్షపండును నలిపినప్పుడు ద్రాక్షారసము కారునట్లు క్రీస్తు తన రక్తమును ఇక్కడ మన కొరకు కార్చెను. ఆహా! ఇది ఎంత ప్రేమ! ఆ రక్తము ద్వారా ఈ దినము మనకు పాప క్షమాపణ, మోక్షప్రాప్తి ఉంది. హల్లెలూయ!

**గబ్బతా - రాళ్ళు పరచిన స్థలము :** ఆ రాత్రి ఆ తోటలో యూదా ఇస్కరియోతు ముద్దు పెట్టుకొని యేసును అప్పగించెను. తరువాత ఆయన అవమానపరచబడి, కొట్టబడి, ముళ్ళ కిరీటము నెత్తిన పెట్టబడి, ఊదారంగు వస్త్రము ధరింపచేయబడెను. నిర్దోషియైన ఆ ప్రభువును ఒక దోషిగా, అన్యాయపు తీర్పు తీర్చుటకు 'గబ్బతా' అను స్థలమునకు తీసికొని వచ్చిరి. ఇదే మనం ధ్యానించు కోబోయే రెండవ స్థలము. గబ్బతా అనగా 'రాళ్లు పరచిన స్థలము' అని అర్థము. యోహాను 19:13లో అది మనం చూడగలము. ఇచ్చట ఆయనను బహిరంగంగా అవమానపరచి, అన్యాయపు నిందలు మోపిరి. ఆయన వధకు తేబడిన గొఱ్ఱెపిల్ల వలె నోరు తెరువలేదు. మన కొరకు ఇంత శ్రమను సహించిన ఈ క్రీస్తు ప్రేమను మరొకసారి తలంచి ఆయనకు లోబడదామా?

గెత్సేమనేలో ఆయన అంతరంగములో వేదన సహించి, భరించెను. గబ్బతా వద్ద ఆయన బహిరంగమైన అవమానమును, అన్యాయమును ఓర్పుని భరించెను. నీ, నా పాభారములకు బదులుగా గబ్బతా వద్ద ఆయన బహిరంగ అవమానమును, అన్యాయమును ఓర్చుకొనెను. తరువాత ఒక బరువైన సిలువను ఆయనపై ఉంచి, ఆయనను గొల్గొతా కొండవరకు తరిమిరి. "ఇదిగో! లోక పాపములను మోసికొనుపోవు దేవుని గొఱ్ఱెపిల్ల' అన్నట్లు ఆయన ఆ సిలువను మోసికొని గొల్గొతా చేరెను.

**గొల్గొతా కొండ:** ఇదే మనం ధ్యానించే మూడవ స్థలము. 'గొల్గొతా' అనగా 'కపాల స్థలము' అని అర్థము. యోహాను 19:19లో అది చూచెదము. లాటిన్ భాషలో దీనినే 'కల్వరి' అందురు. దీనినే తెలుగులో కపాల స్థలము అనగా మానవుని పుఱ్ఱెవంటి ఆకారముగల స్థలము అందురు.

ఇది నరహంతకుల శల్యములతో నిండిన ప్రధాన శ్మశాన స్థలము. ఇది చనిపోయిన వారి ఎముకలతో, పుర్రెలతో నిండిన గుట్ట. మొదటి ఆదాము యొక్క పాపమును జ్ఞాపకము చేయు పాపిష్ఠి జనము యొక్క మహాప్రస్థానము. ఈ కొండ క్రింద మొదటి ఆదాము యొక్క సమాధి ఉన్నదని పండితుల అభిప్రాయము. రెండవ ఆదాము అయిన క్రీస్తు ప్రభువు యొక్క రక్తాభిషేకముచే మరణమును జయించిన స్థలము.

ఇది యెరూషలేము బయట ప్రాకారమునానుకొనిపోవు ఉన్నత రహదారి ప్రక్కన గలదు. మరణశిక్ష పొందవలసిన వారు బాహాటముగా, భయంకరముగా ఇచ్చట చంపబడు దురు. ఎందుకనగా, వ్యాపారము నిమిత్తము పోవు ప్రయాణీకులు ఈ విధమైన చిత్రహింసలతో కూడిన ఘోర మరణమును కన్నులారా చూచి, భయకంపితులై, వారి జీవితములలో ఇటువంటి శిక్షకు కారణములైన దుష్టకార్యములు చేయకుండెదరని. సిలువపై వ్రేలాడేవారు ఆకలికి, దాహమునకు, ఎండకు, చలికి పిచ్చెక్కి చనిపోయే వరకు వ్రేలాడ వలసినదే.

కాని, ప్రభువైన క్రీస్తు పాదములు తాకగానే ఈ కొండ చరిత్ర మారినది. ఇది ప్రకృతిని మార్చిన కొండ. ఇది భూలోకమును పరలోకముతో సమాధానపరచిన కొండ. తండ్రీ, కుమారులకు సహవాసం కలిగించిన కొండ. కఠిన మనస్కుడైన శతాధిపతి మనస్సును కరిగించిన కొండ. దొంగకు పరలోక ద్వారమును తెరచిన కొండ. మరణపు ముల్లును విరిచిన స్థలము. అన్యులను మార్చిన స్థలము. స్వజనులలో మార్పును కలిగించిన కొండ. శాపగ్రస్థమైన ఈ గొల్గొతా ఆశీర్వాదపు భూయిష్టమైనది. కన్నీటికి, వేదనకు స్థానమైన ఈ కొండ శాంతికి నిలయమైనది. మరణశిక్షకు మార్గమైన ఈ కొండ పరలోకమునకు బాటయైనది.

"మన అతిక్రమముల కొరకు ఆయన గాయపరచబడెను. మన దోషములనుబట్టి ఆయన నలుగగొట్టబడెను. మన సమాధానార్ధమైన శిక్ష ఆయన మీద పడెను" (యెషయా 53:5) అన్నట్లుగా ఆయన మన కొరకు సిలువ వేయబడెను. ఆ కల్వరి కొండపై నిర్దోషమైన, నిష్కళంకమైన తన రక్తమంతా కార్చి, వర్తమాన భూత భవిష్యత్ కాలములలో ఉన్న సకల మానవ జాతిని విమోచించెను.

నీవెన్నడైనా **గెత్సేమనే, గబ్బతా, గొల్గొతా** అను ఈ మూడు స్థలములను, వీటిలో ప్రభువు మన కొరకు చేసిన త్యాగమును ధ్యానించితివా? ఇప్పుడైనను ఆయన ప్రేమను ధ్యానించు. నేడే ఈ కల్వరి కొండకు వచ్చి, నీ పాపముల కొరకై పశ్చాత్తాపపడి, ప్రభువు ఇచ్చు ఈ గొప్ప రక్షణను సంపాదించుకొనుము. సిలువ యొద్ద నీ అంతరంగమును తెరచి, నీ పాపములను ఒప్పుకొనుము. ప్రభువు నీకు సహాయము చేయును గాక! ఆమేన్.

## అతి శ్రేష్ఠమైన ఆఖరి వారము

1. **మట్టలాదివారము - జయప్రవేశ దినము :** మత్తయి 21:1-11; మాపు( 11:1-11; లూకా 19:29-44; యోహాను 12:12-19.

2. **సోమవారము - అధికార ప్రయోగ దినము:** మత్తయి 21:18-22; మార్కు 11:12-19

3. **మంగళవారము - విమర్శనాత్మక దినము :** మత్తయి 22:15-46; మారుప 12:13-17; లూకా 20:21-44.

4. **బుధవారము-పాపవిమోచన దినము**: మార్కు 13:3-16.

5. **గురువారము - సిద్ధపరచుదినము :** మత్తయి 26:17-35; మార్కు 14:12-31; లూకా 7:36-38; యోహాను 13:1-31.

6. **శుక్రవారము - చిత్రహింస దినము :** మత్తయి 26:39-57; మార్కు 14:26-72; లూకా 22:39-71; యోహాను 18:1; 19:1-42.

7. **శనివారము - మౌనదినము :** మత్తయి 27:62-66; మార్కు 15:42-47.

8. **ఆదివారము - విజయోత్సవ దినము :** మత్తయి 28:1-10; మార్కు 16:2,7,9-11; లూకా 24:36-48; యోహాను 20:9-23.



రెవ.డా॥ కె.జోసఫ్


# యేసు మృత్యుంజయుడే

**(మానవాళి పాపములకు మూల్యము చెల్లించిన రోజు)**

## The day of Redemption

యోనా మూడు రాత్రింబగళ్ళు తిమింగలం కడుపులో ఎలాగుండెనో ఆలాగు మనుష్య కుమారుడు (యేసు) మూడు రాత్రింబగళ్ళు భూగర్భములో ఉండును (మత్తయి 12:40).

యేసు శుక్రవారము సాయంత్రం చనిపోయి ఆదివారం ఉదయాన్నే లేచాడు. (ఈ విధంగా మనం పండుగ చేసుకుంటున్నాము) శుక్రవారం రాత్రి, శనివారం పగలు, రాత్రి అంటే రెండు రాత్రులు ఒక పగలు. మరి యేసు చెప్పినట్లు మూడు రాత్రుళ్ళు, మూడు పగళ్ళు భూగర్భములో ఎక్కడున్నాడు? (మత్తయి 12:40) అని బల్లగుద్ది మైకు విరిచి హా...హా...హా.. అని ఒక విలన్ నవ్వు నవ్వి ఎగతాళి చేస్తూ వాదిస్తారు. నిజమే మరి యేసుప్రభువు శుక్రవారం చనిపోయి, మనము ఇప్పుడు అవలంబిస్తున్న సమయం ప్రకారం ఆదివారం ఉదయాన్నే లేచినట్లయితే వాళ్ళ వాదన కరక్టే. వాళ్ళు బల్లనూ గుద్దవచ్చును... మైకునూ విరగ గొట్టనూ వచ్చును. విలన్స్‌లాగా మారుమ్రోగేట



ట్లుగా హా... హా... హా... అని వికటట్టహాసం చేయనూవచ్చు. అది విన్న క్రీస్తు విరోధులు ఆహా భలేపాయింట్ యేసుక్రీస్తు అబద్ధికుడని ఋజువు చేశామని రొమ్ము విరుచుకొని చెప్పనూ వచ్చును. అప్పుడు క్రైస్తవులందరూ తల దించుకోవల్సిందే.

కానీ, వారు ఊహించిన విధంగా యేసుక్రీస్తు శుక్రవారం చనిపోలేదు. మనం పాటించే క్యాలెండర్ ప్రకారం ఆయన శుక్రవారంనాడు చనిపోయాడని దానికి గుడ్‌ఫ్రైడే అని బిరుదు ఇచ్చి దానికి ముందు 40 రోజులు లెంట్‌డేస్ అని పేరు పెట్టి పండుగ జరుపుకుంటున్నారు గదా. గుడ్‌ఫ్రైడే నాడు గవర్నమెంట్ వారు కూడా పబ్లిక్ హాలిడేగా డిక్లేర్ చేశారు గదా. మరి ఏమిటయ్యా నీ వాగుడు శుక్రవారం చనిపోలేదంటావు 'దిమాక్ కాని కరాబయ్యిందేంటి' అంటారు. అప్పుడు వారికి మనం చెప్పే సమాధానం ఏమిటంటే యేసుప్రభువు శుక్రవారం నాడు చనిపోయాడని బైబిల్లో ఎక్కడా వ్రాయబడలేదు. మనుష్యులు ఆలాగు పండుగ జరుపుకుంటే అది వారి తప్పు కాని బైబిలు తప్పు కాదు. బైబిల్లో ఉన్న ఒకే మాటను అనగా యేసుప్రభువు చనిపోయినప్పుడు బైబిల్లో ఈ విధంగా వ్రాయబడింది. **"ఆ దినము సిద్ధపరచు దినము. విశ్రాంతి దినము ఆరంభం కావచ్చెను"** లూకా 23:54. విశ్రాంతి దినము ఆరంభం కావచ్చెననే మాట మీద విశ్రాంతిదినం శనివారం కదా మొదలయ్యిందంటే అంతకు ముందు రోజు శుక్రవారమే కదా! ఎందుకంటే యూదులకు సాయంకాలంతో రోజు మొదలవుతుంది. కనుకనే విశ్రాంతిదినం ఆరంభం కావచ్చెనని వ్రాశారు. యేసుక్రీస్తు చనిపోయి లేచిన 300 సం॥ల తరువాత ఈ పండుగలు చేయటం మొదలయ్యింది. విశ్రాంతి దినమునకు ముందురోజు శుక్రవారం కాబట్టి అప్పటికి క్రైస్తవులు శుక్రవారం పండుగ జరుపుతూ వచ్చారు. దానిని ఎవరూ ఖండించనూ లేదు. శుక్రవారం ఒకరోజు, శనివారం ఒకరోజు, ఆదివారం ఒకరోజు మొత్తం మూడు రోజులు అని సర్దుకు పోయారు. అయితే మూడు రాత్రులు మూడు పగళ్ళు లేవని అర్థం చేసుకోలేదు. ఇక్కడ కీలకమైన పాయింట్ విశ్రాంతి దినము. అంటే ఇశ్రాయేలీయులకు పబ్లిక్ హాలిడే. అయితే ఇశ్రాయేలీయులకు ఏడవరోజు వచ్చే రెగ్యులర్ సబ్బాతు మాత్రమే కాక వారికి చాలా విశ్రాంతి దినములున్నవి. మహా విశ్రాంతి దినములు కూడా ఉన్నవి (లేవి.23:32). ఏడవ నెల పదవ దినము అనగా ఆ నెల తొమ్మిదవ నాటి సాయంకాలం మొదలుకొని మరిసటి సాయంకాలం వరకు విశ్రాంతి దినము. ఇవి కాక

ఎనిమిదవ రోజు, పదిహేనవ రోజు పరిశుద్ధ సంఘముగా కూడవలెను. అంతమాత్రమే కాక నియామక దినములను కూడా విశ్రాంతి దినములుగా పరిగణించేవారు. ఈ విశ్రాంతి దినమును సిద్ధపరచు దిన ముగా పిలిచారు. కనుక ఏ విశ్రాంతి దినముకైనా ముందు రోజు సిద్ధపచుదినమే. ఉదాహరణకు గురువారం విశ్రాంతి దినం అనుకోండి అప్పుడు బుధవారం సిద్ధపరచుదినము.

యూదులకు పస్కా పండుగ దినములో క్రమముగా వచ్చే శనివారము విశ్రాంతి దినమే కాక వేరే విశ్రాంతి దినములు కూడా వస్తుంటాయి. అప్పుడు కూడా శుక్రవారము **"మహా విశ్రాంతిదినము"** వాళ్ళ క్యాలెండర్ ప్రకారము వచ్చింది. అందువలన బుధవారం సిద్ధపరచుదినము.

**1. కాబట్టి యేసుక్రీస్తు బుధవారం చనిపోయాడు. బుధవారం సాయంత్రం నుండి గురువారం సాయంత్రం వరకు ఒక రాత్రి, ఒక పగలు.**

**2. గరువారం సాయంత్రం నుండి శుక్రవారం సాయంత్రం వరకు ఒక రాత్రి, ఒక పగలు.**

**3. శుక్రవారం సాయంత్రం నుండి శనివారం సాయంత్రము వరకు ఒక రాత్రి, ఒక పగలు. కనుక మొత్తం మూడు రాత్రులు, మూడు పగళ్ళు.**

**ఆకాశము, భూమి గతించునుగాని నా మాటలు గతించవు (లూకా 21:33) అని యేసు చెప్పిన మాటలు సత్యము.**

**"ఆయనే సత్యము, జీవము, మార్గము"** ఆయన పాపములేని వాడు, మాట తప్పని వాడు. మనమే మాట తప్పే వాళ్ళము. ప్రపంచమంతా కోడై కూసినట్లుగా యేసు ప్రభువు శుక్రవారం చనిపోయాడని పండుగ చేసుకుంటే అది యేసు తప్పా? అది మన తప్పే. ఉదాహరణకు నిన్నా మొన్నటి వరకు ప్రపంచమంతా భూమి బల్లపరుపుగా నీళ్ళ మీద తేలాడుతుంది అని కోడైకూసింది, కాకై అరిచింది (లోకులు పలు కాకులు). అంతమాత్రం చేత గుండ్రంగా ఉన్న భూమి పలకగా మారిపోయిందా? కొన్ని సంవత్సరాలకు ముందే భూమి శూన్యంలో వ్రేలాడదీయబడి వుందని బైబిల్లో (యోబు 26:7) వ్రాయబడి వుంది. గుండ్రంగా ఉందని ఇప్పుడు రుజువైంది. అలానే మనమందరము పండుగ జరుపుకున్నంత మాత్రాన ఆ అబద్ధమే నిజమైపోదు. కనుక క్రైస్తవులందరు కూడా ఇటువంటి వాదనకు తావివ్వకూడదు. యేసు పలికిన మాటలే సత్యము కనుక గుడ్‌ఫ్రైడే కొట్టివేసి, ఆ స్థానంలో బుధవారం రోజును యేసు చనిపోయిన దినముగా సెలబ్రేట్ చేసుకోవాలి, అదే సత్యము. గుడ్‌ఫ్రైడే అనకూడదు **"ద డే ఆఫ్ రిడెమ్షన్'** (The Day of Redemption) అనాలి.

యేసుని నమ్మిన వారందరూ కూడా యేసు అబద్ధికుడు కాదని బుధవారమే యేసు చనిపోయిన దినంగా ప్రకటించు కొని ఇటువంటి వ్యర్థమైన వాదనలు చేసే వారి నోరులు మూయించాలి. మనము తప్పుగా పండుగ ఆచరించడం వలనే కదా ఈ సమస్య మొదలయ్యింది. యేసుక్రీస్తు మీద బురద చల్లే వారికి మనమెందుకు సహకరించాలి. కనుక క్రైస్తవ సమాజమంతా పండుగను **'ద డే ఆఫ్ రిడెమ్షన్'**గా ప్రకటించి బుధవారం జరుపుకుందాం. ఇకపోతే ఈ వ్యర్థవాదనలు చేసేవారు వాదించే విధంగా యేసుప్రభువు ఆదివారం తెల్లవారు జామున లేవలేదు. శనివారం సాయంత్రం అనగా ఆదివారము ప్రవేశించగానే, ఇంగ్లీషులో 'ద యర్లీ అవర్స్ ఆఫ్ ద డే" అంటే ఇప్పుడే మొదలయ్యిందన్న మాట అనగా శనివారం సాయంత్రమే సమాధిని జయించి, మరణాన్ని జయించి, తాను చెప్పిన విధంగా లేచాడన్న మాట. అయితే, కనబడినది మాత్రము ఆదివారము ఉదయమున. ఆ రోజు మనకు చీకటిలో స్త్రీలు సమాధి దగ్గరకు వెళ్ళినప్పుడు యేసు సమాధిలో లేడు. అయితే కొంతమంది శనివారం సాయంత్రమే లేస్తే, ఆదివారం ఉదయం వరకు ఎందుకు కనబడలేదు, ఏం చేస్తున్నాడు అని ప్రశ్నిస్తారు. "ఏం చేస్తే నీకేమిటోయ్" అని మనం అంటే బావుండదు కదా. ఆ విధమైన సమాధానం మనం చెప్పకూడదు. అయ్యా! యేసు ప్రభువు తన్ను వెదికే వాళ్ళకు కనబడతాడయ్యా శనివారం సాయంత్రం లేచిన తరువాత ఆదివారం ఉదయం వరకు ఎవరూ ఆయనను వెదకలేదు. అందుకే ప్రభువు కనబడలేదు. ఆదివారం ఉదయాన్నే వెదికారు, కనబడ్డారు. మూడు రాత్రులు మూడు పగళ్ళు యేసు సమాధిలో ఉన్నాడు.

**వివరణ :** కాబట్టి ఇలా పండుగ దినాలలో యూదులకు మామూలుగా వచ్చే ఏడవ దినము విశ్రాంతి దినమే కాకుండా, మరొక విశ్రాంతి దినము గురువారం వచ్చిందన్న మాట. అప్పుడు బుధవారం సిద్ధపరచుదినము. బుధవారం నాడు యేసుప్రభువు చనిపోయాడు కనుక బుధవారమే మనము **'ద డే ఆఫ్ రిడెమ్షన్'**గా ప్రకటించుకొని సెలబ్రేట్ చేసుకోవాలి. అప్పుడు యేసు చెప్పినట్లుగా యోనావలె తాను మూడు రాత్రులు మూడు పగళ్ళు భూగర్భములో ఉన్నాడు. ఈ జవాబు విన్న తరువాత కూడా ఏదో కొర్రులు గొర్రులు వేస్తుంటారు. అయితే మనం ఇంకేమి మాట్లాడకూడదు. వాళ్ళు ఎంత గొంతు చించుకున్నా.



డా. కె.విక్రాంత్

# సాతాను మరియు పతనమైన దేవదూతలు

ప్రియ పరిశుద్ధత పాఠకులకు మన ప్రభువును రక్షకుడైన యేసుక్రీస్తు నామమున శుభాభివందనములు. ఈ సంచికలో పరిశుద్ధ గ్రంథమందు తెలుపబడిన సాతాను మరియు పతనమైన దేవదూతల గూర్చి తెలుసుకుంటు న్నాము.

**సాతానును గూర్చి :**

1. పతనము కాక మునుపు ఇతనికి 'లూసిఫర్' అను పేరు కలదు. (యెషయా 14:12)
2. ఇతడు దేవుని తోటయగు ఏదెనులో ఉండెను. యెహెజ్కేలు 28:13
3. ఇతడు దేవుని అభిషేకమునొందిన కెరూబు. యెహెజ్కేలు 28:14
4. ఇతడు అమూల్య రత్నములతోను బంగారముతోను అలంకరింపబడెను. యెహెజ్కేలు 28:13
5. ఇతనికి గొప్ప సంగీత ప్రావీణ్యము కలదు. యెహెజ్కేలు 28:13
6. ఇతడు పూర్ణజ్ఞానమునకు, సంపూర్ణ సౌందర్యమునకు మాదిరికరమైన వాడు. యెహెజ్కేలు 28:12
7. ఇతడు గర్వము వలన పడిపోయెను. యెహెజ్కేలు 28:17
8. ఇతడు దేవుని సింహాసనమును దొంగిలించుటకు ప్రయత్నించెను. యెహెజ్కేలు 14:13
9. ఇతడు దేవునికి సమానుడుగా నుండవలెనని కోరు కొనెను. యెహెజ్కేలు 14:14
10. ఇతడు జ్ఞానము కలవాడు. 2కొరింథీ.2:11; 11:3
11. ఇతడు జ్ఞాపకశక్తి కలవాడు. మత్తయి 4:6
12. ఇతడు దృఢ సంకల్పము కలవాడు. 2తిమో.2:26
13. ఇతడు కొన్ని ఇష్టములు కోరికలు కలవాడు. లూకా 22:31
14. ఇతడు గర్వాంధుడు. 1తిమో.4:1.
15. ఇతడు బహు క్రోధము కలవాడు. ప్రకటన 12:12.
16. ఇతడు గొప్ప వ్యవస్థ కలిగినవాడు. 1తిమో.4:1)

**సాతానుకుగల పేర్లు :**

1. సాతాను (అందరూ ఎక్కువగా పిలిచే పేరు. పరిశుద్ధ గ్రంథములో 52 సార్లు ఉపయోగించబడినది).
2. అపవాది (35సార్లు ఉపయాగించబడినది).
3. వాయుమండల సంబంధమైన దేవత. ఎఫెసీ.2:2.
4. ఈ యుగ సంబంధమైన దేవత. 2కొరింథీ.4:4.
5. మరణము యొక్క బలము కలవాడు. హెబ్రీ.2:14,15
6. ఈ లోకాధికారి. యోహాను 12:31.
7. అంధకార సంబంధి. ఎఫెసీ.6:12.
8. మకరము. యెషయా 27:1.
9. లూసీఫరు (తేజోనక్షత్రము, వేకువచుక్క) యెషయా 14:12.
10. ఘటసర్పము. ప్రకటన 12:7.
11. మోసపరచువాడు. ప్రకటన 20:10.
12. అపొల్లుయోను (నాశనము చేయువాడు) ప్రకటన 9:11
13. బయల్జెబూలు (దయ్యములకు అధిపతి) మత్తయి 12:24
14. బెలియాలు (నీచమైన కనికరములేని) 2కొరింథీ.

6:15

15. దుష్టుడు. మత్తయి 13:38.
16. శోధకుడు. 1థెస్సలొనీక. 3:5.
17. సహోదరుల మీద నేరము మోపువాడు. ప్రకటన 12:10
18. వెలుగు దూత. 2కొరింథీ. 11:14,15.
19. అబద్ధికుడు, అబద్ధమునకు జనకుడు. యోహాను 8:44; ఆది. 3:4,5
20. నరహంతకుడు. యోహాను 8:44.
21. శత్రువు. మత్తయి 13:39.
22. గర్జించు సింహము 1పేతురు 5:8.

సాతాను యొక్క కార్యకలాపములు :

1. ఇతనికి అబద్ధపు త్రిత్వము కలదు. ప్రకటన 13:2; 16:13.
2. ఇతడు తన సమాజములు కలిగియుండెను. ప్రకటన 2:9.
3. ఇతడు తన సిద్ధాంతములు కలిగియుండెను. 1తిమోతి 4:1.
4. ఇతడు తన మర్మములు (గూఢమైన సంగతులు) కలిగియుండెను. ప్రకటన 2:24; 1థెస్సలొనీక. 2:7
5. ఇతనికి తన సొంత సింహాసనము కలదు. ప్రకటన 2:13; 13:2.
6. ఇతనికి తన రాజ్యము కలదు. లూకా 4:6.
7. ఇతడు తన ఆరాధికులను కలిగియుండెను. ప్రకటన 13:4.
8. ఇతనికి దూతలు కలరు. ప్రకటన 12:7,8.
9. ఇతనికి తన బోధకులు కలరు. 2కొరింథీ. 11:15.
10. ఇతడు అద్భుత సూచక క్రియలు చేయును. 2థెస్సలొనీక. 2:9; మత్తయి 7:21-23.
11. ఇతనికి బలులు అర్పించు వారు కలరు. 1కొరింథీ. 10:20
12. ఇతనికి తన సహవాసము (సంఘము) కలదు. 1కొరింథీ. 10:20,21.
13. ఇతనికి తన సొంత సైన్యములు కలవు. యెషయా 24:21; ప్రకటన 14:14-17; 16:16.
14. ఇతడు దేవుని గోధుమల మధ్య గురుగులు విత్తును. మత్తయి 13:24-30; 36-43.
15. ఇతడు తప్పుడు బోధలను చేయించును. 1తిమోతి 4:1-3
16. ఇతడు దేవుని వాక్యమును తప్పుగా వక్రీకరించును. ఆది. 3:1-4.
17. ఇతడు దేవుని సేవను ఆటంకపరచును. 1థెస్స. 2:18.
18. ఇతడు దేవుని పిల్లలు చేయు ప్రార్ధనలను అడ్డగించును. దానియేలు 10:12,13.
19. ఇతడు మనుష్యులు సత్యము వైపు మరలకుండ వారికి గ్రుడ్డితనము కలుగజేయును. 2కొరింథీ. 4:4.
20. ఇతడు మనుష్యుల హృదయములలోని దేవుని వాక్యమును దొంగిలించును. మత్తయి 13:19.
21. ఇతడు దేవుని యెదుట క్రైస్తవులపై నేరములు మోపును. యోబు 1:7-12; 2:3-6; జెకర్యా 3:1-4; ప్రకటన 12:10.
22. ఇతడు మనుష్యుల కొరకు ఉరితాళ్ళు పెట్టును. 2తిమోతి 2:26; 1తిమోతి 3:7.
23. ఇతడు శోధించును. మత్తయి 4:1; ఎఫెసీ. 6:11.
24. ఇతడు మనుష్యులను శారీరక మరియు మానసిక బాధలచే కృంగదీయును. యోబు 2:7; లూకా 13:16; 2కొరింథీ. 12:7; అపొ.కార్య. 10:38.
25. ఇతడు మోసగించును. ప్రకటన 12:9; 20:8,10.
26. ఇతడు కుటుంబములోని ప్రశాంత వాతావరణమును పాడుచేయును. 1కొరింథీ. 7:3-5.
27. ఇతడు దేవుని యొక్క ఆజ్ఞలను అతిక్రమించునట్లు ఆయనను నమ్మి పరిశుద్ధులను మరియు నమ్మని పాపులను ఇరువురిని పురికొల్పును. 1దిన. 21:1; మత్తయి 16:22,23; యోహాను 13:2. అపొ.కార్య. 5:3.

**పతనమైన దేవదూతలను గూర్చిన సత్యములు :**

1. పతనమైన దేవదూతలు పేర్లు కలిగియుండెదరు. లూకా 8:30; ప్రకటన 9:11;
2. వీరు మాట్లాడెదరు. లూకా 4:34,41; 8:28; మత్తయి 8:29; మార్కు 5:12; అపొ.కా.19:15.
3. వీరికి యేసు ఎవరో తెలియును. మార్కు 3:11; లూకా 4:34.
4. వీరికి భవిష్యత్తులో జరుగబోవు నాశనమును గూర్చి తెలియును. మత్తయి 8:29.
5. వీరికి రక్షింపబడని వారి మధ్యగల రక్షింబడిన వారు తెలియును. ప్రకటన 9:4.
6. వీరు సాతానును ఘనపరచు క్రమబద్ధమైన మత ధర్మశాస్త్రమును రూపొందించు సామర్థ్యము గలవారు. 1తిమోతి 4:11.
7. వీరు గొప్ప బలము శక్తి కలిగియుండెదరు. నిర్గమ. 8:7; 7:11,12; దానియేలు 10:13; మార్కు 5:2-4; 9:17-26; అపొ.కా.19:16; 2కొరింథీ. 10:4,5; ప్రకటన 9:15-19.
8. వీరు భయపడెదరు. లూకా 8:28; యాకోబు 2:19.
9. వీరు ఏవగించుకొనెదరు. అపొ.కా.16:15;
10. వీరిలో కొందరు బంధింపబడని వారు కలరు. ప్రస్తుతం జరుగుచున్న కాలములో వీరికి కొంత స్వేచ్ఛ గలదు. కీర్తనలు 78:49; ఎఫెసీ.6:12; ప్రకటన 12:7-9.
11. వీరిలో కొందరు బంధింపబడిన వారు కలరు. ప్రస్తుతం జరుగుచున్న కాలములో వీరికి స్వేచ్ఛలేదు. 2పేతురు 2:4
12. ఈ ప్రపంచములోని రాజ్యములను యేలు కొన్ని దయ్యపు దూతలు గలవు. దానియేలు 10:13
13. 'సేన' అను దుష్టుడైన దేవదూత ఒకడు అనేక అపవిత్రాత్మలకు నాయకుడై గెరాసేనుల దేశమందు ఒక మనుష్యునికి పట్టెను. మార్కు 5:9.
14. పాతాళము అబద్దోను (హెబ్రీభాషలో) గ్రీకుభాషలో అపొల్లుయోను అను పతనమైన దూత చెప్పు చేతలలో ఉండును. ప్రకటన 9:11.
15. నలుగురు పతమైన సైనిక దూతలు నరకాత్మకులైన 20 కోట్ల మంది సైన్యములను గ్రీకుల కాలము కొంత గతించిన తరువాత మనుష్యులలో మూడవ భాగమును చంపుటకు నడిపించెదరు. ప్రకటన 9:16.
16. ఈ నలుగురు దూతలు ప్రస్తుతము యూఫ్రటీసు మహానది యొద్ద బంధింపబడియుండిరి. ప్రకటన 9:14.
17. మరికొందరు దూతలు పాతాళ లోకమందలి కటిక చీకటిగల బిలములలో బంధింపబడియుండిరి. 2పేతురు 2:4: యూదా 6.
18. హర్‌మెగిద్దోను యుద్ధమునకు దారి తీయు పరిస్థితులను మరియు సంఘటనలను మూడు అపవిత్రాత్మలు నడిపించును. ప్రకటన 16:13,14.
19. పతనమైన దేవదూతలకు ప్రభువైన క్రీస్తు మరియు ఆయన యొక్క సంఘము తీర్పు తీర్చును. 1కొరింథీ.6:3.
20. చివరికి వీరిని దేవుడు నిత్యనరకాగ్నిలో పడద్రోయును. మత్తయి 25:4; యూదా 6; 2పేతురు 2:4.


**ఇంటర్నెట్‌లో 'పరిశుద్ధత' మాసపత్రిక కొరకు ఈ క్రింది వెబ్‌సైట్ సందర్శించండి**

Read Our Internet Edition @

**www.holinessmagazine.com**



# పునరుజ్జీవములు మరియు సంస్కరణలు

శ్రీమతి రిబ్కా విక్రాంత్

ప్రియ, పరిశుద్ధత పాఠకులకు మన ప్రభువును రక్షకుడైన యేసుక్రీస్తు నామమున వందనములు :-

ఈ సంచికలో బైబిల్‌లో తెలుపబడిన పునరుజ్జీవ ములు మరియు సంస్కరణలు గూర్చి తెలుసుకుందాము.

**1. యాకోబు ద్వారా :** బేతేలుకు తిరిగి వెళ్ళుచు యాకోబు తన యింటి వారితోను, తన యొద్దనున్న వారందరితోను తమ యొద్దనున్న అన్యదేవతల విగ్రహము లను పారవేసి తమను తాము శుద్ధి చేసికొని, క్రొత్త వస్త్రములను ధరించు కొనుడని ఆజ్ఞాపించెను. నిజమైన సత్యదేవునికి యాకోబు బలిపీఠము నిర్మించుటకు వారట్లు చేసి తమ యొద్దనున్న అన్యదేవతా విగ్రహములన్నిటిని మరియు చెవులకున్న పోగులను వారు యాకోబుకు అప్పగింపగా అతడు వాటిని షెకెము దగ్గరనున్న మస్తకి వృక్షము క్రింద పాతిపెట్టెను. ఆదికాండము 35:1-4.

2. **సమూయేలు ద్వారా:** ఇశ్రాయేలీయులందరు యెహోవాను అనుసరింప దుఃఖించుచుండగా, సమూయేలు "మీ పూర్ణ హృద యముతో నిజమైన దేవుని యొద్దకు మళ్ళుకొని అన్యదేవతలను, అష్తారోతు దేవతలను మీ మధ్య నుండి తీసివేసి పట్టుదల కలిగి దేవుని ప్రార్థించుడి అని చెప్పగా వారట్లుచేసిరి. 1సమూ. 7:3-6.

3. **మోషే ద్వారా :** ఎఱ్ఱ సముద్రమును మోషే పాయలుగా చీల్చుట మరియు తాము ఆరిన నేలపై నడచి సురక్షితముగా సముద్రమును దాటుట చూచిన ఇశ్రాయేలీ యులు తమ యెడల దేవుడు జరిగించిన గొప్ప కార్యము నకు భయపడి ఆయన యందు నమ్మకముంచి నపుడు ఈ పునరుజ్జీవము వచ్చెను. అప్పుడు ఇశ్రాయేలీ యులు దేవునికి ప్రత్యేక గీతము పాడగా అహరోను సహోద రియైన మిర్యాము ఇతర స్త్రీలందరితో పాటు తంబురలను చేతపట్టి నాట్యమాడెను. నిర్గమ. 14:31, 15:21.

4. **దావీదు ద్వారా :** (అ) యెరూషలేము పట్టణమునకు మొట్టమొదటిసారిగా దేవుని నిబంధన మందసము తేబడి నప్పుడు ఇశ్రాయేలీయులలో వచ్చిన పునరుజ్జీవము. 1దిన. 15:-28; 16:1-43; 29:10-25. (ఆ) సొలొమోను నిర్మింప బోవు దేవుని మందిరమునకు అవసరమైన ఉపకర ణములన్నిటిని కూర్చి వాటిని దావీదు దేవునికి ప్రతిష్ఠ చేసినప్పుడు వచ్చిన పునరుజ్జీవము. 2దిన. 29 అధ్యా.

5. **సొలొమోను ద్వారా :** ఈ పునరుజ్జీవము సొలొమోను దేవునికి నిర్మించిన మందిర ప్రతిష్ఠ సమయంలో వచ్చినది. 2దిన. 7:1-3.

6. **ఆసా ద్వారా :** ఇతడు తన పితరులు చేయించిన అన్య విగ్రహములన్నింటిని నిర్మూలము చేసెను. అంతేగాక తన అవ్వయైన మయకా చేయించిన అసహ్యమైన దేవతా స్తంభ మును కాల్చివేసి ఆమె పట్టపుదేవి కాకుండా తొలగించెను. 1రాజులు 15:11-15.

7. **యెహోషాపాతు ద్వారా :** ఇతడు దేవుని మందిరమును పవిత్రపరచి, దేశమందుగల అన్యదేవతా స్తంభములను తొల గించి, లేవీ యాజకులు న్యాయమును తీర్పు తీర్చు విషయంలో అనేక సంస్కరణలు చేపట్టెను. 2దిన. 19వ అధ్యాయము.

8. **ఏలీయా ద్వారా :** కర్మెలు పర్వతముపై బయలు దేవతా ప్రవక్తలతో ఏలీయా పోటీచేసి విజయము సాధించిన తరువాత పునరుజ్జీవము వచ్చినది. 1రాజులు 18:21-40.

9. **యెహూ ద్వారా :** ఇతడు బయలు దేవతారాధికులం దరిని మరియు వారి దేవాలయములను నాశనము చేసెను. 2రాజులు 10:15-28.

10. **యెహోయాదా ద్వారా :** దేవుని సంబంధుడైన ఈ ప్రధాన యాజకుడు రాజుతోను ప్రజలతోను తాము దేవుని వారమని నిబంధన చేయించి వారందరితో బయలు గుడిని దాని విగ్ర హములన్నింటిని నాశనము చేయించెను. 2రాజులు 11:17-20.

11. **హిజ్కియా ద్వారా :** యెహోషాపాతువలె ఇతడు కూడా దేవుని మందిరమును పవిత్రపరచి ఇశ్రాయేలీయులలో పునరు జ్జీవము తెచ్చెను. 2దిన. 29-31.

12. **మనష్షే ద్వారా:** దుష్టుడైన ఈ రాజు దేవుని తట్టు తిరిగి మారుమనస్సు పొంది దేవుని మందిరము నుండి అన్యదేవతా విగ్రహములను తొలగించి, దేవుని బలిపీఠ మును బాగుచేసి దానిమీద సమాధాన బలులను కృతజ్ఞతా ర్పణలను అర్పించుచు తన ప్రజలను కూడా ఆ విధముగా చేయుమని ఆజ్ఞాపించెను. 2దిన. 33:11-20.

13. **యోషీయా ద్వారా :** దేవుని మందిరమందు అనుకోని విధముగా ధర్మశాస్త్ర గ్రంథము దొరుకుటతో ఈ పునరుజ్జీ వము ప్రారంభమైనది. ఈ గ్రంథములోని దేవుని మాటలు రాజైన యోషీయా మీదను అతని ప్రజల మీదను గొప్ప ప్రభావమును చూపినవి. 2రాజులు 22,23 అధ్యా.

14. **ఎజ్రా ద్వారా:** ప్రత్యేకతను గురించి ఎజ్రా బోధించగా ఇశ్రాయేలీయులు అన్యులను పెండ్లి చేసికొనుటను స్వస్తి చెప్పి తమ్మును తాము వేరుచేసికొనిరి. ఎజ్రా 9,10 అధ్యా.

15. **నెహెమ్యా ద్వారా :** నెహెమ్యా యెరూషలేము పట్టణ నకు ప్రాకారము పునర్నిర్మించిన తరువాత ఎజ్రా ఆ ప్రాకారపు గుమ్మల యొద్ద నిలుచుండి దేవుని వాక్యమును బహిరంగముగా చదువుటచే ప్రజలలో గొప్ప పునరుజ్జీవము ప్రారంభమైనది. నెహెమ్యా 13 అధ్యా.

16. **యోనా ద్వారా :** నీనెవె పట్టణము పైకి దేవుని తీర్పు రాబోవుచున్నదని యోనా ప్రకటించగా ఆ పట్టణస్తులు పశ్చాత్తాప పడి దేవుని వైపు తిరిగి మారుమనస్సు పొందిరి. యోనా 3 అధ్యా.

17. **ఎస్తేరు ద్వారా :** దుష్టుడైన హామాను దురాలోచన నుండి ఎస్తేరు ద్వారా రక్షింపబడిన యూదులు నెమ్మది పొంది సంతో షముగా నుండిరి. ఎస్తేరు 9:17-22.

18. **బాప్తిస్మమిచ్చు యోహాను ద్వారా :** ఇశ్రాయేలీయుల యొక్క మెస్సియా ప్రత్యక్షతను గూర్చి బాప్తిస్మమిచ్చు యోహాను బోధించుచు, పశ్చాత్తాపపడి నీటి బాప్తిస్మము తీసుకోవలసినదిగా ప్రజలను హెచ్చరించుటచే ఈ పునరుజ్జీ వము ప్రారంభమైనది. లూకా 3:2-18.

19. **ప్రభువైన యేసు ద్వారా :** ఒక సమరయ స్త్రీ క్రీస్తును అంగీకరించుట ద్వారా ఈ పునరుజ్జీవము సమరయ పట్టణంలో పురిగొల్పబడినది. యోహాను 4:28-12.

20. **ఫిలిప్పు ద్వారా :** సువార్తికుడైన ఫిలిప్పు ఒక దేవుని రాజ్యమును గూర్చి బలముగా బోధించుటచే సమరయ పట్ట ణంలో గొప్ప పునరుజ్జీవము ప్రారంభమైనది. అపొ.కార్య. 8:5-12.

21. **పేతురు ద్వారా:** (అ) పెంతెకోస్తు పండుగ దినమున పేతురు గొప్ప ప్రసంగము చేసిన తరువాత. అపొ.కార్య. 2వ అధ్యా. (ఆ) లుద్దలో ఎనిమిది ఏండ్ల నుండి పక్ష వాయువు రోగముతో బాధపడుచున్న ఐనెయును స్వస్థపర చిన తరువాత. అపొ.కార్య. 9:32-35.

22. **అపొస్తలుడైన పౌలు ద్వారా:** పౌలు సువార్త కొరకు మూడవ పర్యటన చేయుచు ఎఫెసు పట్టణమును సందర్శించగా, ఈ పట్టణములో గొప్ప పునరుజ్జీవము ప్రారంభమైనది. అపొ.కార్య. 19:11-20.

## బైబిల్ క్విజ్ - 15 జవాబులు

1. కాదేషులో (ద్వితీ. 1:46)
2. ఆరు దేశమును (13:16)
3. 13 మూరల పొడవు 6 మూరల వెడల్పు (3:11)
4. మూడు పురములను (4:42)
5. నరహత్య చేయకూడదు (5:17)
6. మస్సాలో (6:16)
7. వేయి తరముల వరకు (7:9)
8. ఆహారము వలననే గాక యెహోవా సెలవిచ్చిన ప్రతి మాట వలన నరులు బ్రదుకుదురని తెలియ జేయుటకు (8:3)
9. దేవుని వ్రేలితో (9:10)
10. మోసేరుకు (10:6)
11. ఏబాలు కొండమీద (11:29)
12. రక్తము (12:23)
13. రాళ్ళతో చావగొట్టవలెను (13:10)
14. మూడు సంవత్సరములకు ఒకసారి (14:28)
15. 7వ సంవత్సరమున (15:12)
16. రాత్రివేళ (16:1)
17. సహోదరులలో ఒకనిని (17:15)
18. లేవీయులకు (18:1)
19. ఇద్దరు లేదా ముగ్గురు సాక్షులు (19:15)
20. చెట్లు (20:19)
21. రాళ్ళతో చావగొట్టవలెను (21:21)
22. ఎద్దు, గొఱ్ఱె, గాడిద (22:1-4)
23. మూడవ తరము వారు (23:8)
24. ఒలీవ, ద్రాక్షపండ్లను (24:20,21)
25. అమాలేకీయులు (25:19)

గత నెల ప్రశ్నలకు జవాబులు వ్రాసిన వారు :

**పి. చిన్నారావు**

వినుకొండవారివీధి, బాప్టిస్టునగర్, విజయవాడ



# అక్షరయజ్ఞం



## బైబిల్ క్విజ్ - 16

ద్వితీయోపదేశకాండం 26 నుండి యెహోషువ 16

శ్రీమతి కె. ప్రసన్న పరాక్రమ్

1. ఇశ్రాయేలీయులు దశమ భాగమును ఎప్పుడు ఇయ్యవలెను?
2. ఏ రాళ్ళతో దేవుడైన యెహోవాకు బలిపీఠము కట్టవలెను?
3. 50 వచనాల కంటే ఎక్కువ ఉన్న అధ్యాయాలు ఎన్ని ఉన్నాయి?
4. హెష్బోను రాజు ఎవరు?
5. మనము కోరుకొనునట్లు దేవుడు మనముందు ఉంచినవి ఏమిటి?
6. చనిపోకముందు మోషేకు దేవుడు ఎక్కడ ఎలా కనిపించెను?
7. మోషే ఎక్కడ ఇశ్రాయేలీయుల మధ్య దేవుని పరిశుద్ధపరచక తిరుగుబాటు చేసెను?
8. ద్వితీయోదేశకాండములో చిన్న అధ్యాయము ఏది?
9. ఏ దేశములో మోషే మృతి చెందెను?
10. యెహోషువ తండ్రి పేరు ఏమిటి?
11. కనాను దేశమును వేగు చూచుటకు యెహోషువ వేగులను ఎక్కడ నుండి పంపెను?
12. మోయుచున్న మందసమునకు ఇశ్రాయేలీయులు ఎంత దూరముగా ఉండాలి?
13. యొర్దానులో నుండి ఎన్ని రాళ్ళను తెచ్చెను. యెహోషువ వాటిని ఎక్కడ నిలువబెట్టించెను?
14. పస్కా పండుగను ఎక్కడ, ఎప్పుడు ఆచరించిరి?
15. 7 దినములలో మొత్తం ఎన్నిసార్లు పట్టణము చుట్టూ తిరిగెను?
16. ఆకాను తండ్రి పేరు ఏమిటి?
17. ఇశ్రాయేలీయులు ఎంతమంది హాయి ప్రజలను చంపెను?
18. యెహోషువతో సమాధాన నిబంధన చేసికొనిన వారి పట్టణములు ఏవి?
19. ఏ అద్భుత కార్యము చేయుట ద్వారా యెహోవా శత్రువులను చంపెను?
20. 11వ అధ్యాయములో పేర్కొన్న కొండల పేర్లు ఏమిటి?
21. బాషాను రాజు పేరు ఏమిటి?
22. లేవీయులకు స్వాస్థ్యము ఏమిటి?
23. కనాను దేశమును వేగు చూచుటకు వెళ్ళినప్పుడు కాలేబు వయస్సు ఎంత?
24. ఒత్నీయేలు భార్య పేరు ఏమిటి?
25. కనానీయులు ఎక్కడ ఎఫ్రాయిామీయులకు దాసులే యున్నారు?

**గమనిక :** ఈ ప్రశ్నలన్నిటికి సమాధానాలు బైబిలు నుండి గ్రహించవచ్చును. మీరు ఈ బైబిల్ క్విజ్‌లో పాల్గొనటం ద్వారా బైబిలు జ్ఞానమును సంపాదించాలన్నదే మా ఉద్దేశ్యం. కావున ప్రతి ఒక్కరూ ఈ బైబిల్ క్విజ్‌లో పాల్గొని బైబిలు జ్ఞానము సంపాదించటంతో పాటు బహుమతులు గెలుపొందవలసినదిగా కోరుచున్నాము.